ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 3, జనవరి 2024

అభ్యర్థుల ఎంపికలో అధికార వైసీపీ మరో ముందడుగు వేసింది. ఒంగోలు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడు సుధీర్‌ను రంగంలోకి దింపబోతోంది. వైపాలెం నుంచి చంద్రశేఖర్‌నే నిర్ణయించింది. గిద్దలూరు నుంచి బాలినేనిని బరిలో నిలపనుంది. అయితే ఎంపీ స్థానానికి మాగుంటకు అవకాశం ఇస్తారా? లేదా? అన్న సందిగ్ధంలో బాలినేని ఉన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి గురువారం వచ్చి కలవాలని సీఎంవో నుంచి సమాచారం వచ్చింది. దర్శి నుంచి బూచేపల్లి, కనిగిరికి బుర్రా పేర్లు కూడా దాదాపు ఖరారయ్యాయి. అయితే మంగళవారం సీఎం జగన్.. బాలినేని కానీ, మాగుంట కానీ లేకుండానే శిద్దా, చంద్రశేఖర్‌తో మాట్లాడారు. జంకెతో సాయిరెడ్డి భేటీ అయ్యారు. అవన్నీ ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి.

ఒంగోలుకు సుధీర్

- తేల్చిచెప్పిన జగన్
- రెండురోజుల్లో చెప్తామన్న శిద్దా
- వైపాలెంలో చంద్రశేఖర్‌కు గ్రీన్‌సిగ్నల్
- మార్కాపురం పెండింగ్
- జంకెతో సాయిరెడ్డి మంతనాలు
- రేపు రమ్మని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి కబురు
- గిద్దలూరుకు బాలినేని?
- మాగుంట విషయంలో మాజీ మంత్రి సందిగ్ధం


సీఎంకు బొకే ఇస్తున్న శిద్దా రాఘవరావు, సుధీర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలోని ఆయా అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై మంగళవారం వైసీపీ అధిష్ఠానం కసరత్తు చేసింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన కుమారుడు సుధీర్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఎర్రగొండపాలెం టికెట్ ఆశిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్‌లను తాడేపల్లి పిలిపించుకున్నారు. వీరిలో శిద్దా, ఆయన కుమారుడు సుధీర్‌తో అలాగే చంద్రశేఖర్‌తో సీఎం జగన్ భేటీ అయ్యారు. తొలుత శిద్దా ఆపార్టీ నాయకుడు సాయిరెడ్డితో మాట్లాడారు. ఆ తర్వాత వారిద్దరూ జగన్‌ను సాయంత్రం మూడున్నర తర్వాత కలిశారు. సీఎం నేరుగా 'ఒంగోలు నుంచి సుధీర్ పోటీ చేయాలి, అతని రాజకీయ భవిష్యత్తు నేను చూసుకుంటా. రానున్న 30ఏళ్లు సుధీర్ నాతో పయనిస్తాడు, మీరు నిశ్చింతగా ఉండండి' అని రాఘవరావుకు చెప్పి సుధీర్ భుజం తట్టినట్లు తెలిసింది. అయితే వారికి లోక్‌సభ నుంచి మాగుంట పోటీచేస్తారా? బాలినేని ఎక్కడ పోటీచేస్తారు? అనే విషయంపై జగన్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. చివరికి శిద్దా రాఘవరావు తమకు కొద్దిగా సమయం ఇవ్వండి ఒంగోలు వెళ్లి అన్నీ మాట్లాడుకుని వచ్చి కలుస్తామని చెప్పినట్లు తెలిసింది. జాప్యం చేయకుండా ముందు పోటీకి సిద్ధపడుతున్నట్లు తనకు సమాచారం ఇవ్వండి, ఎక్కువ రోజులు వేచిచూసేది లేదని జగన్ తేల్చిచెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత తండ్రీకొడుకులు కారెక్కి నేరుగా ఒంగోలు వచ్చారు. కొంతసేపు ఎవరికీ ఫోన్‌లో కూడా అందుబాటులో లేని వారు ఆ తర్వాత కొంతమంది సన్నిహితులతో సీఎం ఒంగోలులో పోటీ చేయమంటున్నారు.. మీతో మాట్లాడాలి ఒకసారి కలుద్దామని చెప్తున్నట్లు తెలిసింది. మంగళవారం రాత్రికే కుటుంబసభ్యులు, సన్నిహితులతో వారు మాట్లాడుకున్నట్లు సమాచారం.

చంద్రశేఖర్‌కు గ్రీన్‌సిగ్నల్

సీఎం జగన్‌ను తాటిపర్తి చంద్రశేఖర్ కలిశారు. మీరు ఎర్రగొండపాలెం నుంచి పోటీ చేయాలి. వెంటనే వెళ్లి పని ప్రారంభించుకోండి అని ఆయనతో సీఎం చెప్పారు. చంద్రశేఖర్ తన గురించి చెప్పుకోబోగా 'నాకు అంతా తెలుసు. అన్నీ ఆలోచించే మిమ్మల్ని పంపుతున్నాను. నిశ్చింతగా పనిచేసుకోండి' అని చెప్పినట్లు తెలిసింది.

జంకెతో విజయసాయి చర్చలు

మార్కాపురం టికెట్ ఆశిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితో విజయసాయిరెడ్డి చర్చలు జరిపారు. అయితే ఆయన్ను సీఎంతో కలపలేదు. మార్కాపురం ఎమ్మెల్యే తండ్రి కేపీ కొండారెడ్డి అనారోగ్యంతో వైద్యశాలలో ఉన్నారు. అందువలన నాగార్జునరెడ్డితో మాట్లాడి మిమ్మల్ని మూడు రోజుల్లో పిలిపిస్తామని చెప్పినట్లు సమాచారం. జంకె విషయంలో సీఎం సానుకూలంగా ఉన్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు. అయితే లోక్‌సభ అభ్యర్థి ఎంపికకు అనుగుణంగా మార్కాపురం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాల్సి ఉంది.

గిద్దలూరు నుంచి బాలినేని

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేరును గిద్దలూరుకు పరిశీలిస్తున్నారు. ఆమేరకు ఆయనకు, ఇతర నాయకులకు కూడా అధిష్ఠానం సంకేతాలు ఇచ్చింది. అయితే బాలినేనిని మంగళవారం తాడేపల్లికి పిలవలేదు. ఒంగోలు లోక్‌సభ నుంచి మాగుంటను తప్పించే ఆలోచనలో ఉన్నందున ఆయనకు గతంలో కూడా పిలుపురాలేదు. తాజాగా మంగళవారం అభ్యర్థుల ఎంపిక కసరత్తుకు బాలినేనిని కూడా పిలవకపోవటం విశేషం. అయితే లోక్‌సభ స్థానం నుంచి మాగుంటకే అవకాశం ఇవ్వాలని బాలినేని పట్టుబడుతున్నట్లు తెలిసింది. మిగిలిన అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక తర్వాత బాలినేనిని పిలిచి జగన్ మాట్లాడతారని, ఆయన గిద్దలూరు నుంచి పోటీచేస్తారని అనుచరులు భావిస్తున్నారు. అందిన సమాచారం మేరకు బాలినేని మాత్రం మాగుంటను రంగంలోకి దింపేందుకు పట్టుబట్టి ఆ తర్వాతే తాను అసెంబ్లీకి పోటీచేసేదని చెప్పాలన్న ఉద్దేశంలో ఉన్నట్లు తెలిసింది.

12 అసెంబ్లీ స్థానాలు టీడీపీవే


శంఖారావం ఏర్పాట్లపై నిర్వహించిన సభలో మాట్లాడుతున్న దామచర్ల

- మాజీ ఎమ్మెల్యే దామచర్ల
- శంఖారావం సభకు తరలిరావాలని పిలుపు
- కనిగిరిలో ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు

వివరాలు లోపలి పేజీల్లో..

పెంచారు.. ఆపేశారు..!

ప్రతి నెలా ఏ ఒక్కరితో సంబంధం లేకుండా నేరుగా వలంటీర్ల ద్వారా అందించే పింఛన్ సొమ్ముకు ఈనెలలో ప్రభుత్వం ఎమ్మెల్యేలతో లింకు పెట్టింది. పెంపు మహోత్సవాలంటూ హడావుడి చేయాలని, శాసనసభ్యులను పిలవాలని ఆదేశించింది. అయితే జిల్లాలోని ఎమ్మెల్యేలంతా ఎన్నికల వైపు దృష్టి సారించారు. తమకు టికెట్ దక్కుతుందో, లేదోనన్న మీమాంసలో ఉన్నారు. ప్రభుత్వమేమో స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పింఛన్‌లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు డీఆర్‌డీఏ, వైకేపీ అధికారులు తేదీలను కూడా ఖరారు చేసి ప్రకటించారు. దీంతో ఈ నెలలో పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు అందటం ఆలస్యమయ్యే పరిస్థితి అనివార్యమైంది.


కనిగిరి నగర పంచాయతీ కార్యాలయంలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

- జిల్లాలో పింఛన్ల పంపిణీ ఆలస్యం
- పెంపు మహోత్సవాల పేరుతో ఆర్భాటం
- ఈనెల 8వరకు నిర్వహించాలని ఆదేశం
- ఎమ్మెల్యేలకు సమయం కుదిరితేనే పంపిణీ
- గ్రామాల్లో లబ్ధిదారుల ఎదురుచూపులు

ఒంగోలు నగరం, జనవరి 2 : ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటికే వచ్చి అందించే పింఛన్ సొమ్ము ఈ నెలలో చేతికందేందుకు వారం రోజులపైనే పట్టనుంది. ఈనెల నుంచి పింఛన్‌ను రూ.3 వేలు చేసిన రాష్ట్రప్రభుత్వం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పింఛన్ పెంపు మహోత్సవాలు నిర్వహించి వాటికి ఎమ్మెల్యేలను ఆహ్వానించి వారి ద్వారా ఇప్పించాలని ఆదేశించింది. ఇందుకోసం ప్రతి మండలానికి పంపిణీ చేసే తేదీని ముందుగానే ప్రకటించింది. జనవరి ఒకటో తేదీన కనిగిరి, ఒంగోలు నియోజకవర్గాల్లో పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. 2న హెచ్‌ఎంపాడు, కనిగిరి, పీసీపల్లి, మార్కాపురం, ఒంగోలులో పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. 3న దొనకొండ, ముండ్లమూరు, గిద్దలూరు, పామూరు, వెలిగండ్ల, మర్రిపూడి, చీమకుర్తి, ఎన్‌జీపాడు, ఎస్‌ఎన్‌పాడు, దోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం, వైపాలెం, 4న కురిచేడు, కంభం, జరుగుమల్లి, శింగరాయకొండ, పొదిలిల్లో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 5న దర్శి, బీపేట, కొమరోలు, కొండపి, పొన్నలూరు, టంగుటూరు, కొనకనమిట్ల, 6న తాళ్లూరు, అర్థవీడు, ఒంగోలు అర్బన్, గిద్దలూరు, 8న గిద్దలూరు, రాచర్ల, మద్దిపాడు మండలాల్లో పింఛన్ల పంపిణీ ఉంటుందని ప్రకటించారు. అయితే జిల్లాలో ఎక్కడా స్థానిక ఎమ్మెల్యేలు పింఛన్ పెంపు మహోత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తిచూపడం లేదు. జనవరి 1,2 తేదీల్లో ప్రకటించిన మండలాల్లో కూడా ఎమ్మెల్యేలు హాజరు కాకుండానే స్థానిక ప్రజాప్రతినిధులతో వైఎస్సార్‌కేపీ ఉద్యోగులు మహోత్సవాలు నిర్వహించి పంపిణీని ప్రారంభించారు. అయితే మండలంలోని లబ్ధిదారులందరికీ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా కొద్దిమందికే పంపిణీ చేస్తున్నారు. ఇక మిగిలిన మండలాల్లో కూడా ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పింఛన్ పెంపు మహోత్సవాలు నిర్వహించిన తర్వాతే పంపిణీ ప్రారంభించాల్సి ఉంది కాబట్టి ఈ నెల 8వ తేదీ వరకు పంపిణీ జిల్లా మొత్తం మీద ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది.

అవసరమైన నిధులు రూ.88.98 కోట్లు

జిల్లాలో మొత్తం సామాజిక పింఛన్లు 2,97,415 ఉన్నాయి. వీటికి నెలవారీగా రూ.88.98 కోట్లు అవసరం. మొత్తం పింఛన్‌లలో వృద్ధాప్య, వితంతు, చేనేత, ఒంటరి మహిళల, కల్లుగీత కార్మికుల పింఛన్లు 2,47,638 ఉన్నాయి. ఈ లబ్ధిదారులకు మాత్రమే ఇప్పటివరకు రూ.2,750 ఇస్తున్నారు. వీటిని ప్రభుత్వం ఇప్పుడు రూ.3 వేలకు పెంచింది. ఇవిపోను హెచ్‌ఐవీ బాధితులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.3వేలకుపైనే ప్రభుత్వం పింఛన్ ఇస్తూ వస్తోంది. రూ.3 వేలకు తక్కువగా ఉన్న పింఛన్లనే ప్రభుత్వం రూ.3వేలు చేసి ఈ నెల నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించింది.

విడుదలైంది రూ.46.26 కోట్లు

ప్రభుత్వం ఆర్భాటంగా ఈనెల నుంచి పింఛన్లను రూ.3వేలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. అందుకు తగ్గట్లుగా అవసరమైన మేరకు నిధులను విడుదల చేయలేదు. రూ.46.26 కోట్లు మాత్రమే ఇచ్చింది. నిధులు లేకనే పెంపు మహోత్సవాల పేరుతో పింఛన్ల పంపిణీని ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో శాసనసభ్యులు ఈ మహోత్సవాల్లో పాల్గొని పింఛన్లు పెంచామని చెప్పుకునేందుకు పెద్దగా ఆసక్తి కూడా చూపడం లేదు. అయితే నిధులు లేక మహోత్సవాల పేరుతో పంపిణీని ఈ నెల 8వతేదీ వరకు చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు పింఛన్ల పంపిణీకి అవసరమైన నిధుల్లో సగం మాత్రమే జిల్లాకు విడుదల య్యాయి.

జిల్లాకు కొత్తగా 3,731 పింఛన్లు మంజూరు

జిల్లాలో గతనెల వరకు 2,93,684 సామాజిక పింఛన్లు ఉన్నాయి. ఈ నెలలో కొత్తగా 3,731 మంజూరు చేసింది. కొత్త పింఛన్లతో కలుపుకొని జిల్లాలో మొత్తం పింఛన్లు 2,97,415కి చేరాయి. కొత్తగా మంజూరైన వారికి కూడా రూ.3వేల వంతున ఈనెల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.


దర్శిలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

దున్నపోతులకు వినతిపత్రాలు

- 22వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
- అన్ని కేంద్రాల్లో ఆందోళనలు

ఒంగోలు నగరం, జనవరి 2 : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరింది. వివిధ రూపాల్లో, వినూత్న పద్ధతిలో తమ ఆందోళనను కొనసాగిస్తున్న కార్యకర్తలు, ఆయాలు మంగళవారం దున్నపోతులకు వినతిపత్రాలను ఇచ్చి నిరసనను తెలియజేశారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో రిలేదీక్షలు నిర్వహిస్తూనే ఎక్కడికక్కడ దున్నపోతుకు అర్జీలు సమర్పించారు. గత 22 రోజులుగా తాము చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలియజేస్తూ ఇలా నిరసన తెలిపారు. ఇకనైనా నిద్రలేచి తమతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఒంగోలులో కలెక్టరేట్ వద్ద దీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐటీయూ నాయకులు దామా శ్రీనివాసులు, జీవీకొండారెడ్డి, నారాయణరెడ్డి, మహేష్ సందర్శించి మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీల యూనియన్ నాయకులు కేవీ సుబ్బమ్మ, ప్రశాంతి, జ్యోతి, హేమోమా పాల్గొని దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం మొద్దు నిద్రవీడాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. దర్శి, కనిగిరి, మార్కాపురం, పొదిలి తదితర ప్రాంతాల్లో కార్యకర్తలు, ఆయాలు ఆందోళన నిర్వహించి దున్నపోతులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదన్నారు. ఇంతకాలం ప్రభుత్వం గౌరవ వేతనం పేరుతో తమను నానా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. గౌరవ వేతనం కాదు కనీస వేతనం నెలకు రూ.25వేలు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు. వైసీపీ మంత్రులు, కొంతమంది ఎమ్మెల్యేలు ఉద్యమాన్ని చులకన చేసి మాట్లాడటం శోచనీయన్నారు. తమను పట్టించుకోకపోతే సత్తా ఏమిటో రాబోయే ఎన్నికల్లో చూపిస్తామని వారు హెచ్చరించారు.

కొన్నిశాఖల ఉద్యోగులకే జీతాలు

- 40 శాతం మందికి ఇంకా పడలేదు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 2 : ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల సమస్య ఇంకా కొలిక్కిరాలేదు. నూతన సంవత్సరంలోనైనా తొలి రోజే అందుతాయని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. గతంలో మాదిరిగానే ఎప్పుడు పడతాయోనని ఎదురుచూడాల్సి వస్తోంది. కేవలం కొన్నిశాఖల వారికి మాత్రమే జీతాలు పడగా మెజారిటీ ఉద్యోగులు ఉన్న శాఖలకు మాత్రం ఇంకా అందని పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త సంవత్సరంలోనైనా 1వతేదీనే ఉద్యోగులు, పెన్షనర్లు తమ బ్యాంకు అకౌంట్లలో జీతాలు, పెన్షన్లు జమ అవుతాయని ఆశించారు. అయితే జగన్ సర్కారు అందుకు భిన్నంగా వ్యవహరించడంపై మండిపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు మరో 20 వేలమంది వరకు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. ఇలా అన్నిశాఖల్లో 50వేల మందికిపైగానే పనిచేస్తున్నారు. ఇప్పటివరకు సచివాలయ, ట్రెజరీ, పోలీస్‌తోపాటు మరో నాలుగైదు శాఖల ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడ్డాయి. మిగిలిన వారంతా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మళ్లీ.. బాదేశారు!

- విద్యుత్ అరియర్స్ పేరుతో అదనపు వడ్డన
- ప్రతి ఇంటికీ రూ.500 నుంచి రూ.1000 వరకూ భారం

కొండపి, జనవరి 2 : ప్రభుత్వం కొత్త సంవత్సరంలో పేదలకు షాక్ ఇచ్చింది. మరోసారి విద్యుత్ బిల్లుల భారం మోపింది. అరియర్స్ పేరుతో ఒక్కో గృహానికి రూ.500 నుంచి రూ.1000 వరకూ వడ్డించింది. ఏమి అరియర్సో అర్థంకాక వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో పెండింగ్ ఏమీ లేకపోయినా.. అదనపు లోడ్ పేరుతో వేసిన బిల్లులు చెల్లించినప్పటికీ జనవరి బిల్లులో అరియర్స్ అంటూ అదనంగా చార్జీలు వేయడంపై మండిపడుతున్నారు.



అరియర్స్ పేరుతో రూ.480 అదనంగా వేసిన విద్యుత్ బిల్లు

ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యసేవలు

• కలెక్టర్ దినేష్‌కుమార్


మందులను అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మద్దిపాడు, జనవరి 2: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మల్లవరంలో ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ నివాస్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా కార్పొరేట్ వైద్య సేవలు అందజేయాలన్నారు. జిల్లా వైద్యాధికార రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పేదలకు వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు సరళాదేవి, మాధవీలత, సుమిత్, రామాంజనేయులు, ఆనందమోహన్, వినీలచౌదరి, ఎంపీపీ వాకా అరుణ, ఎంపీటీసీ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ కళాశాలల్లోనూ న్యాక్ తప్పనిసరి


పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

ఒంగోలు(విద్య), జనవరి 2 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల తరహాలో ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో కూడా న్యాక్ గుర్తింపు తప్పనసరి అని విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ స్పష్టం చేశారు. ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలకు న్యాక్ గుర్తింపు తప్పనిసరి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిజిటలైజేషన్ విజయవంతమైనందున ఎయిడెడ్ కళాశాలలు కూడా డిజిటలైజేషన్ కావాలని ఆయన చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏడు యాప్‌లను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థకు సాంకేతిక, సృజనాత్మకత అత్యవసరమని స్పష్టం చేశారు. డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల న్యాక్ ఎ గ్రేడ్ సాధించినందుకు భాస్కర్ అభినందించారు. సమావేశంలో ఆర్‌జేడీ డాక్టర్ జ్యోత్స్నకుమారి, ఏజీవో మస్తానమ్మ, ప్రిన్సిపాల్ డి.కళ్యాణి, 26 ప్రభుత్వ, 22 ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసి కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పోలా భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు.

అప్పులబాధతో గుంటూరువాసి ఆత్మహత్య


ఖాజారహంతుల్లా(ఫైల్)

ఒంగోలు(క్రైం) జనవరి 2: అప్పుల బాధతో గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి ఒంగోలులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల స్వాతి లాడ్జిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గుంటూరుకు చెందిన షేక్ ఖాజారహంతుల్లా (46) అక్కడి ఆర్టీసీ డిపో వద్ద హోటల్లో పని చేస్తుంటాడు. ఇటీవల బాగా అప్పులు పెరిగి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. గత నెల 30న విజయవాడ వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఒంగోలుకు వచ్చిన ఖాజారహంతుల్లా ఈనెల 31న స్వాతి లాడ్జిలోని రూం.102లో దిగి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే రెండు రోజులుగా గది తలుపులు తీయక పోయే సరికి లాడ్జి యజమాని చూసి తలుపులు తెరచి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ ఎం.లక్ష్మణ్, ఎస్సై మురళిలు తన సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12లోపు ఓటు దరఖాస్తుల పరిశీలన : ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 2: ఓట్ల నమోదు, చేర్పులు, మార్పుల కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 12వతేదీ వరకు పరిశీలన జరుగుతుంద ని ఆర్డీవో విశ్వేశ్వరరావు తెలిపారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ఉన్న పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిని విచారణ చేసి ఈనెల 17వతేదీ నాటికి పూర్తి చేసి22న తుది ఓటర్లజాబితాను ప్రచురిస్తామని చెప్పారు. ఒంగోలులో అన్ని నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగు రూములు, ఓట్లలెక్కింపు కేంద్రాలు పరిశీలన చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు ఆర్డీవో తెలిపారు. అంతకు ముందు రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు అంశాలను ఆర్డీవో దృష్టికి తెచ్చారు. వాటిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో అజిత, ఏసీపీ కె.వెంకటేశ్వర్లు, అర్జున్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీ ఎస్.క్రాంతికుమార్, కటారి సంజీవ్, స్వరూప్, గుర్రం సత్యం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 2: గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు అన్ని రకాల పశువులకు టీకాలు వేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం ఈమేరకు ఆయన టీకాల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో 4.91 లక్షల డోసులు అందుబాటులో ఉందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ


అక్షతల కలశాలు తీసుకుంటున్న మహిళలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 2: అయోధ్య రామ మందిరంలో పూజ చేసిన అక్షతలను ఇంటింటికీ పంపిణీ కోసం మంగళవారం మహిళా భక్తులు కలశాలను స్వీకరించారు. ఒంగోలు నగరం రాజీవ్‌నగర్‌లోని బ్రాహ్మణ వృద్ధాశ్రమ భవన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అక్షతల కలశాలను వృద్ధాశ్రమ నిర్వాహకులు బొల్లాప్రగడ భుజంగరావు, దేనువకొండ వెంకటసుబ్బయ్య, ధూళిపాళ్ల కోటేశ్వరశర్మలు మహిళా భక్తబృందానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య రాముని పాదస్పర్శ పొందిన ఈ అక్షతలు ఎంతో పవిత్రమైనవని, వీటిని రాజీవ్‌నగర్ ప్రాంతంలోని ప్రతి ఇంటికీ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గుండ్లపల్లి లక్ష్మీదేవి, మొక్కపాటి ఆదిలక్ష్మి, ఈదర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టు దుర్మరణం


కిషోర్ మృతదేహం

ఒంగోలు క్రైం, జనవరి 2: ఆగివున్న లారీని మోటార్‌సైక్లిస్టు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు నగరం కొప్పోలు ఫ్లైఓవర్ పైన గల జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మోటార్ సైకిలిస్టు ఫ్లైఓవర్‌పై సర్వీసురోడ్డు నుంచి ఎక్కుతుండగా ఆగి ఉన్న లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టాడు. అతి వేగంగా మోటార్ సైకిల్‌తో ప్రయాణం చేయటంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో తలకు బలమైన గాయం కావటంతో మోటార్‌సైకిలిస్టు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు స్థానిక ఇందిరకాలనీ 13లైన్‌లో ఉండే నేలపాటి కిషోర్ అలియాస్ తిమోతి(47)గా గుర్తించారు. ఆయన ప్రైవేటు కళాశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే దారిలో ప్రయాణం చేస్తున్న ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ప్రమాదం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి తన సిబ్బందితో ప్రమాద స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు ప్రభుత్వ అల్టిమేటం

ఎల్లుండిలోగా విధులకు హాజరుకాకపోతే చర్యలు • నోటీసులు జారీకి సిద్ధమవుతున్న అధికారులు

తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదంటున్న కార్యకర్తలు • నేడు కలెక్టరేట్ దిగ్బంధనానికి పిలుపు


కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం, జనవరి 2: గత 22 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం మంగళవారం అల్టిమేటం జారీ చేసింది. ఈ నెల 5వ తేదీలోగా విధుల్లో చేరకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విజ్ఞప్తి పేరుతో అంగన్‌వాడీలకు నోటీసులు జారీ చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఇప్పటికే ఈ నోటీసులను ప్రభుత్వం జారీ చేయగా జిల్లాలో మాత్రం బుధవారం నుంచి జారీ చేసేందుకు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు అమరావతి నుంచి జిల్లా ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడారు. ఈనెల 5వ తేదీలోగా విధుల్లోకి హాజరుకాకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 11 డిమాండ్లతో ఈ నెల 12వ తేదీ నుంచి సమ్మెలోకి దిగిన అంగన్‌వాడాలతో మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్య కార్యదర్శి, స్త్రీ శిశుసంక్షేమశాఖ ఉన్నతాధికారులు పలు ఫాలుగా చర్చలు జరిపిన తర్వాత ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించిందని, వాటికి సంబంధించిన జీవోలను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిందని ఆ వివరాలను తెలియజేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి పేరుతో నోటీసులు జారీ చేయనున్నారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వెంటనే సమ్మెను విరమించి విధుల్లో చేరాలని, లేకుంటే చర్యలు తప్పవంటూ అంగన్‌వాడీలకు నోటీసులు జారీ చేయనున్నారు. కాగా ప్రభుత్వ హెచ్చరికలను అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ నాయకులు మాత్రం ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు బెదిరేదే లేదని చెబుతున్నారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ మంగళవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ల దిగ్బంధానికి అంగన్‌వాడీ వర్కర్సు అండ హెల్పర్సు యూనియన్ పిలుపునిస్తుందని తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చకుండానే సమ్మెను విరమించాలని బెదిరించటం, శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించటం చర్యలకు నిరసనగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆమె తెలిపారు.

అక్రమ లే అవుట్లను వెంటనే తొలగించండి

యజమానులకు నోటీసులు జారీకి కలెక్టర్ ఆదేశం • ఎస్‌ఎన్‌పాడు, పామూరు, సింగరాయకొండ ఈవోఆర్డీలపై ఆగ్రహం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 2: జిల్లాలో ఉన్న అనధికార లే అవుట్లను వెంటనే తొలగించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనధికార లే అవుట్ల రిజస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని మండల విస్తరణాధికారులు, కార్యదర్శులను కలెక్టర్ ఆదేశించారు. సంతనూతలపాడు, పామూరు, సింగరాయకొండ మండలాల్లో అక్రమ లే అవుట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్రమ లే అవుట్లను తొలగించాలని స్పష్టం చేశారు. ఒడా అనుమతితో నిర్వహిస్తున్న అన్ని రకాల అధికార లే అవుట్లలో పది శాతం భూమిని పంచాయతీలకు వెంటనే స్వాధీనం చేయాలని ఆదేశించారు. అలా పంచాయతీలకు స్వాధీనం చేయకుంటే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. నూతనంగా నిర్మించే భవనాల అనుమతులను మాన్యువల్‌గా ఇవ్వకూడదని, సదరు అనుమతులకు ఆన్‌లైన్‌లోనే మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా వేసిన లే అవుట్లను వెంటనే తొలగించేందుకు యజమానులకు నోటీసులు జారీ చేయలని చెప్పారు. ఉపాధి పనులకు సంబంధించి ఎస్సీఎస్టీ కుటుంబాలకు వంద రోజుల పనిదినాలను కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో హౌసింగ్ లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలు కచ్చితంగా ఉండాలని, ఆడిట్‌లో గుర్తించిన నగదును వెంటనే రికవరి చేయాలని సూచించారు. సచివాలయాల్లో సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్‌కు సంబంధించి మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, జీవీ.నారాయణరెడ్డి, పేరయ్య, మర్దన్‌అలీ, కొండయ్య, రవికుమార్, వసుంధర, ఉషారాణి, అంజల, సుబ్బారావు, చంద్రశేఖర్‌రెడ్డి, శీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓటమికే ఇండియా కూటమి ఏర్పాటు

• కేంద్ర మాజీ మంత్రి శీలం


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ.శీలం

ఒంగోలు(క్రైం), జనవరి2: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఐఎన్‌డీఐఏ (ఇండియా) కూటమి ఏర్పడిందని కేంద్ర మాజీ మంత్రి జేడీ.శీలం పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సమాలోచన కార్యక్రమం మంగళవారం ఒంగోలులోని అబేడ్కర్‌భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీకి మద్దతు పలుకుతున్న ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఆసన్నమైందని తెలిపారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు కేంద్ర నిధులతో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అందరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీకి దళితులు, క్రైస్తవల మీద ఎలాంటి ప్రేమ లేదని చెప్పారు. మణిపూర్ ఘటనకు అనుకూలంగా పార్లమెంట్‌లో వైసీపీ ఓటు వేసిన విషయాని గుర్తు చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సిరివెళ్ళ ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని అర్థమని తెలిపారు. రాష్ట్రంలో అసమర్ధపాలన నడుస్తుందని, అభివృద్ధి కుంటు పడుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని వీడిన వారంతా తిరిగి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సాకే శంకర్, కొరివి వినయ్‌కుమార్, తాంతియా కుమారి, జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి, నాగలక్ష్మి, ఉద్దండి మల్లిఖార్జునరావు తదితరలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

వెంకటేశ్వర ఎడ్యుకేషన్ విద్యాసంస్థల అధిపతి మిట్టా సంజీవ్‌రెడ్డి మాజీమంత్రి జేడీ.శీలం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన సంజీవరెడ్డి ప్రస్తుతం విద్యాసంస్థలు నడుపుకుంటున్నారు. దర్శిలో బూచేపల్లి కుటుంబాన్ని రెండు పర్యాయాలు గెలిపించేందుకు కృషి చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అవసరమని, ఇంకా ఎక్కువసంఖ్యలో పార్టీలో తన అనుచరుల చేరతారని ఆయన పేర్కొన్నారు.

చీమకుర్తిలో పారిశుధ్య కార్మికుల అరెస్ట్

ఇరువురు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, 50మంది సిబ్బందితో హల్‌చల్ • కొవిడ్ కార్మికులతో చెత్త లిఫ్టింగ్ • ప్రజాసంఘాల నిరసన ర్యాలీ


చెత్త పక్కనే ధర్నా చేస్తున్న కార్మికులు

చీమకుర్తి, జనవరి 2 : చీమకుర్తి పట్టణంలో గత ఎనిమిది రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న దాదాపు 92మంది పారిశుధ్య కార్మికులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కార్మికుల సమ్మెతో పట్టణంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నది. సమ్మెలో లేని కొవిడ్ సమయంలో విధుల్లోకి తీసుకున్న కార్మికులతో చెత్తను ఎత్తించటానికి గత వారంరోజులుగా మున్సిపల్ పాలకవర్గం చేస్తున్న ప్రయత్నాలను సమ్మెలో ఉన్న కార్మికులు ఎప్పటికపుడు అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారుల విన్నపంతో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, 50మంది సిబ్బంది సమ్మె చేస్తున్న కార్మికల వద్దకు విచ్చేచారు. ప్రజల ఆరోగ్యానికి సహకరించాలని లేదంటే తమ పద్ధతిలో తాము వ్యవహరిస్తామని కార్మికులకు తెలిపారు. తాము న్యాయపోరాటం చేస్తున్నామని, ఇక్కడనుంచి కదిలేది ఏమి లేదని కార్మికులు భీష్మించుకొని చెత్త వద్దే బైఠాయించి చెత్తను లిఫ్టింగ్ చేయకుండా నిలువరించారు. దీంతో పోలీసులు కార్మికులను అదుపులోకి తీసుకొని ప్రైవేటు వాహనాల్లో పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి సాయంత్రం వరకూ స్టేషన్‌లో ఉంచి తదుపరి వదిలిపెట్టారు. ఈలోపు సమ్మెలో లేని కార్మికులతో పట్టణంలోని చెత్తను డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. కాగా కార్మికుల అరెస్టును నిరసిస్తూ పలు ప్రజాసంఘాల నాయకులు పట్టణంలో నిరసన ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, నాయకులు పల్లామల్లి ఆంజనేయులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో రోజుకు చేరిన మునిసిపల్ కార్మికుల సమ్మె

• ఒంటికాలిపై నిలబడి నిరసన


ఒంటికాలిపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు


ఉరితాళ్లలో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 2 : సమస్యల పరిష్కార కోరుతూ ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులతో పారిశుధ్య పనులు, పోలీసులతో అరెస్టులు చేసినా బెదిరేది లేదన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఉరితాళ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్): సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. గత 14 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఆయా సమస్యలను పట్టించుకోక పోవడం దారుణంగా ఉందని మండిపడ్డారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్(జేఏసీ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఉద్యోగులు దీక్షా శిబిరం వద్ద ఉరితాళ్లను తగిలించుకొని తమ జీవితాలను బతికిలించాలంటూ నినదించారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కళ్యాణి పాల్గొన్నారు.

రిమ్స్ శానిటేషన్ సిబ్బంది ధర్నా


ధర్నా చేసిన శానిటేషన్, సెక్యూరిటీ స్టిబంది

ఒంగోలు(కార్పొరేషన్): ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఓ గంటసేపు విధులు బహిష్కరించి ఆసుపత్రి ఆవరణం బయట నినాదాలు చేశారు. సెక్యూరిటీ, శానిటేషన్ ఏజెన్సీ అయిన ఏజిల్ సంస్థ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఈమేరకు ఆసుపత్రి అధికారులు ఆందోళనకారులతో మాట్లాడి సమస్యల పరిష్కారంపై ఏజెన్సీతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి విధుల్లోకి వెళ్ళారు.


ఉత్సవర్యాలీలో పాల్గొన్న శిద్దా లక్ష్మీపద్మావతి, మహిళలు

ఘనంగా గోదాదేవి సారె మహోత్సవం

చీమకుర్తి, జనవరి2: ధనుర్మాసం సందర్భంగా చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో శ్రీ గోదాదేవి అమ్మవారి సారె మహోత్సవం మంగళవారం కనులపండవగా జరిగాయి. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి సారెతో ఊరేగింపుగా హరిహరక్షేత్రం వరకు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. వెండి గంగాళం, సువర్ణ ముక్కెర, పసుపు, కుంకుమలను అమ్మవారికి శిద్దా లక్ష్మీపద్మావతి సమర్పించారు. విశేషపూజలు జరిపారు. కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నవోదయ విద్యార్థులకు జాతీయస్థాయి ప్రశంసలు

ఒంగోలు(విద్య), జనవరి 2: ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. స్థానిక నవోదయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న ఎల్.రాకేష్, కె.జయంత్‌కుమార్ రూపొందించిన భవిష్యత్ విద్యుత్ ప్రాజెక్టు జాతీయ స్థాయి ఎన్‌సీఈఆర్‌టీ అధికారులు, శాస్త్రవేత్తలు అభినందించారు. 30 మంది నవోదయ విద్యార్థులు, నలుగురు గైడ్ టీచర్ల కృషితో ఈ ప్రాజెక్టు రూపుదిద్దారు. జాతీయ స్థాయిలో పూణేలో జరుగుతున్న జాతీయవైజ్ఞానిక ప్రదర్శనల్లో ఈ ప్రాజెక్టు అందరి దృష్టిని ఆకర్షించింది. కాగా జాతీయస్థాయిలో ఒంగోలు నవోదయకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ప్రత్యేకంగా అభినందించారు.

డెయిరీ ఫాంలు, గేదెలకు రుణాలు ఇప్పించాలి


కేంద్రమంత్రి రూపాలకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 2: వెనుకబడిన పశ్చిమ ప్రకాశం జిల్లాలో సంవృద్ధిగా వర్షాలు లేక నిరుద్యోగులకు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, అందువల్ల ఉపాధి కోసం డెయిరీ ఫామ్స్, గేదులు, మేకలు కొనుగోళ్ళకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం రాత్రి కొత్తపట్నం వచ్చిన కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పర్షోత్తమ్ ఖోడాభాయ్ రూపాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీశివారెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాలల్లో వర్షాలు లేక, పంటలు పండక రైతులు కూడా ఇతర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా లేని పరిస్థితి ఏర్పడిందని, అందువల్ల నిరుద్యోగ యువతకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

12లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు(విద్య); జనవరి 2 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఈనెల 12లోపు పేర్లు నమోదు చేసుకోవాలని షైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మంగళవానం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

జ్వరం వచ్చిన వెంటనే వైద్యం పొందాలి


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వాణి

ఒంగోలు(రూరల్), జనవరి 2: జ్వరమని అనుమానం వస్తే తప్పక వైద్యసేవలు పొందాలని డాక్టర్ ఎస్.వాణి పేర్కొన్నారు. ఉలిచి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కరవది పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ దోమలు కుట్టకుండా గ్రామస్తులు దోమ తెరలు వాడుకోవాలన్నారు. టైఫాయిడ్, మలేరియా లాంటి జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పలువురిని పరీక్షించి ఉచితంగా మందులు పంపణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు జయకుమారి, రజనికుమార్, ఎంఎల్‌హెచ్‌పీ రవికుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలను వేయించాలి


టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి2: పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పక వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.బేబీరాణి కోరారు. ఉప్పుగుండూరు పశువైద్యశాల ఆవరణలో మంగళవారం గాలికుంటు టీకాల కార్యక్రమం ఆమె మాట్లాడారు. పశువులకు గాలికుంటు రాకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 250 పశువులకు వైద్యసిబ్బంది టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ డీడీ డాక్టర్ పద్మావతి, ఏడీఏ నాగభూషణం, డాక్టర్ జాస్మిన్, జేవీవో లావణ్య తదితరులు పాల్గొన్నారు

సీపీఐ సహాయ కార్యదర్శి మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 2: సీపీఐ ఒంగోలు నగర సహాయ కార్యదర్శి విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు సమన్వయ సమితి సభ్యుడు బొమ్మిశెట్టి చంద్రశేఖర్ (58) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రశేఖర్ చికిత్స పొందుతూ మృతి చెందారు. కొండపి మండలం పేరదేపిలో యువన సంఘంలో కార్యకర్తగా పనిచేసి ఆ తర్వాత కాలంలో తన నివాసాన్ని ఒంగోలుకు మార్చి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగానే పాల్గొనే వారు. స్థానిక భాగ్యనగర్‌లో చంద్రశేఖర్ మృతదేహాన్ని ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, నాయకులు కరవది సుబ్బారావు, చంద్రనాయక్, పీవీఆర్.చౌదరి, ఉప్పుటూరి ప్రకాశరావు, కారుమూడి నాగేశ్వరరావు, మోహన్‌రావు, పి.లక్ష్మి, పి.వెంకటేశ్వర్లు, కొత్తకోట వెంకటేశ్వర్లు, బొడ్డపాటి సుబ్బారావు, సిద్దయ్య, సీపీఎం నాయకులు జీవీ.కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్‌బాబు నివాళులర్పించారు

నేడు యూటీఎఫ్ ధర్నా

ఒంగోలు(విద్య), జనవరి 2: ప్రతినెలా 1వ తేదీనే జీతాలు, పింఛన్లు చెల్లించాలని, ఆర్థిక బకాయిల సాధనకు బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశంభవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రరసంకు పూర్ణకుంభ పురస్కారం

ఒంగోలు(కల్చరల్).జనవరి 2: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే 2వ అంతర్జాతీయ మహాసభలలో మన జిల్లాకు చెందిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం (ప్రరసం)కు ప్రతిష్ఠాత్మక పూర్ణకుంభ పురస్కారం అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారని ప్రరసం జిల్లా అధ్యక్షులు పొన్నూరి వేంకటశ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో నిర్వహించనున్న మహాసభలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పూర్ణకుంభ పురస్కారాల ఎంపిక చేయగా మన జిల్లా నుంచి ప్రరసం ఎంపికయ్యిందన్నారు. ప్రరసం తరపున వెంకట శ్రీనివాసులు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. కాగా ప్రరసంకు ఈ పురస్కారం లభించటం సంస్థ కార్యదర్శి యత్తపు కొండారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగులు లైవ్ సర్టిఫికెట్ సమర్పించాలి

చీమకుర్తి, జనవరి2 : రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్లు లైవ్ సర్టిఫికెట్ సమర్పించాలని పెన్షనర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ఎస్టీవో కార్యాలయంలో, లేదా ఈసేవలో ఫిబ్రవరి 29లోపు సమర్పించాలని పేర్కొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు యూటీఎఫ్ వితరణ

చీమకుర్తి, జనవరి 2 : సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష అభియాన్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు యూటీఎఫ్ మండల శాఖ మంగళవారం సంఘీభావం తెలిపింది. ఐదువేల రూపాయలను విరాళంగా అందించింది. వీటిని ఏంఈఓలు వెంకటేశ్వర్లు, శివాజీల ద్వారా ఉద్యోగులకు అందజేశారు.

యరజర్లలో పింఛన్లు పంపిణీ

ఒంగోలు(రూరల్), జనవరి2: యరజర్ల గ్రామ పంచాయతి కార్యాలయంలో మంగళవారం రాష్ట్రప్రభుత్వం పెంచిన పింఛన్లను ఎంపీడీవో పి.అజిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జనవరి నెల నుంచి సంక్షేమ పింఛన్లు రూ.3వేలకు పెంచి ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు, సర్పంచ్ రాములమ్మ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 2: వచ్చే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ స్థానాల్లో సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా పోటీ చేస్తుందని రాష్ట్ర కా ర్యదర్శి మ హ్మాద్ గని తెలిపారు. ఒంగోలులో మంగళవారం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ స త్తార్ అధ్యక్షతన సవవేశంలో గని మాట్లాడారు. కార్యక్రమంలో సుభాని, సాద్ మౌలానా, నూరుల్లా, ఇంద్రిస్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

శివరాయునిపేటలో కీలక నేతలు టీడీపీలో చేరిక

సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే స్వామి



ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీలో చేరిన శివరాయునిపేట వైసీపీ ముఖ్యనాయకులు

మర్రిపూడి, జనవరి 2 : మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. శివరాయునిపేటలో ఆపార్టీకి చెందిన కీలకనేతలతోపాటు 30 కుటుంబాల వారు మంగళవారం ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. కాకర్ల పంచాయతీ పరిధిలోని శివరాయునిపేటలో రెండు ప్రధాన సామాజికవర్గాలకు చెందిన వైసీపీ ముఖ్యనాయకులను పార్టీలో చేర్చుకునేందుకు గతకొన్ని రోజులుగా టీడీపీ ముఖ్యనేతలు సమాలోచనలు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా యాదవ సామాజికవర్గంలో కీలక నేతగా గుర్తింపు పొందిన జేసీఎస్ కన్వీనర్ కలగట్లు కాశయ్య, ఎస్సీ కాలనీకి చెందిన మోయిడి భాస్కర్‌రావుల ఆధ్వర్యంలో 30 కుటుంబాలకుపైగా స్థానిక శాసనసభ్యులు బాలవీరాంజనేయలు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయి టీడీపీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. మరికొద్ది రోజుల్లో కొన్ని కీలక గ్రామాల్లో పార్టీలో చేరికల ఉంటాయని తెలిసింది. మొత్తం మీద వైసీపీకి అడ్డాగా ఉన్న శివరాయునిపేటలో రెండు ప్రధాన సామాజికవర్గాలకు చెందిన నాయకులు టీడీపీలో చేరడంతో తెలుగు తమ్ముళ్లు జోష్‌లో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, నాయకులు వేమిరెడ్డి రమణారెడ్డి, రామిరెడ్డి, చెరుకూరి బ్రహ్మయ్య, గంగిశెట్టి శ్రీనివాసరావ్, తరిమెళ్ల ప్రేమానందం, గురిజాల ఏసుపాదం, బోయపాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ఆలకూరపాడు విద్యార్థిని సత్తా



హెచ్‌ఎం, పీడీతో క్రీడాకారిణి పూజిత

ఆలకూరపాడు (టంగుటూరు), జనవరి 2 : జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా నిర్వహించిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఆలకూరపాడు జిల్లా పరిషత్ విద్యార్థిని సుదర్శి పూజిత సత్తా చాటారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరుచునాపల్లిలో జరిగిన అండర్-17 పోటీల్లో పాల్గొన్న ఆమె విశేష ప్రతిభ కబర్చి అందరిమన్ననలు అందుకున్నారు. తిరిగి స్వగ్రామానికి చేరుకున్న పూజితను మంగళవారం హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి, పీడీ వెంకట్రావు, ఉపాధ్యాయులు దామచర్ల శ్రీధర్, పి.జ్యోతి, చెన్నయ్య, విజయలక్ష్మి, సురేష్, సుబ్బారావు, సుభాషిణి అభినందించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, జనవరి 2: ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తులసీరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం అద్దంకి వచ్చిన ఆయన డిపోలోని కార్మికులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై డిపో అధికారులకు మెమోరాండం అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే స్వామి డిమాండ్

పొన్నలూరులో దీక్షలో పాల్గొని మద్దతు

పొన్నలూరు (కొండపి), జనవరి 2 : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, పనికి తగినట్టు ప్రభుత్వం నెలకు రూ.26వేల జీతం ఇవ్వాలని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. కార్యకర్తలు చేస్తున్న నిరసన శిబిరంలో వారు మంగళవారం పాల్గొని మద్దతు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను మరిచి మాటతప్పి, మడం తిప్పారని విమర్శించారు. అంగన్‌వాడీలు శాంతియుతంగా నిరసన చేస్తుంటే ప్రభుత్వం బలవంతంగా కేంద్రాల తాళాలు పగులగొట్టడం దారుణమన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ కొండపి నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు అనమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు మండవ ప్రసాద్, నందికనుమ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

దున్నపోతుకు వినతిపత్రం

కొండపి : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా జిల్లా నాయకురాలు కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరసనలో ఆమె మంగళవారం పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. వారికి మద్దతుగా నిలవాల్సిన ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తుండటం దారుణమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం డివిజన్ నాయకుడు కేజీ మస్తాన్, సీఐటీయూ నాయకుడు జి.వందనం పాల్గొన్నారు. కాగా నిరసన శిబిరం వద్దకు దున్నపోతును తోలుకుని వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం దున్నపోతుతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ సంఘ నాయకులు ఆదిలక్ష్మి, పున్నమ్మ, రంగమ్మ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు టీడీపీవే

మాజీ ఎమ్మెల్యే దామచర్ల

శంఖారావం సభకు తరలిరావాలని పిలుపు

ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు

కనిగిరి, జనవరి 2 : ప్రకాశం జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడమే టీడీపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అన్నారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో చంద్రబాబు ఎన్నికల సమర శంఖారావం తొలి సభ ఏర్పాట్లను మంగళవారం ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఇన్‌చార్జిలు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఏలూరి సాంబశివరావు, దామచర్ల సత్య, నారపశెట్టి పాపారావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, బాలవీరాంజనేయస్వామి, ఎరిక్షన్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, ఐటీఎం కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవీంద్రతో కలసి జనార్దన్ పరిశీలించారు. రాష్ట్రంలో ఎన్నికల సమర శంఖారావం తొలి సభ కనిగిరిలో ఏర్పాటు చేయడం వెనుక జిల్లాపై, కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని సభ విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని జనార్దన్ కోరారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే ఆంధ్రరాష్ట్రం కనుమరుగైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల విజయవంతానికి ప్రకాశం జిల్లా పాజిటివ్ ఎనర్జీని ఇస్తుందన్నారు. ఇటీవల ఒంగోలులో మహానాడు, యువగళం నెలిమర్ల ముగింపు సభ విజయవంతంలో డాక్టర్ ఉగ్ర చూపిన చొరవ, కృషి బాబు మనసులో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఆ కారణంగా కనిగిరిలో తొలి ఎన్నికల సమర శంఖారావం సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సభకు రెండు లక్షల మందికి పైగా వచ్చే అవకాశం ఉందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి చెందాలన్నాదే తన సంకల్పమన్నారు. ఎన్నికల శంఖారావం సభలో చంద్రబాబును కనిగిరి ప్రాంతానికి అవసరమైన వాటిని రాబట్టేందుకు మంచి వేదిక ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు, యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. శంఖారావం సభలో చంద్రబాబుకు కనిగిరి ప్రాంతానికి వీటి అవసరం ఉందని తెలియజెప్పాలంటే అశేషంగా ప్రజలు సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు హామీ ఇచ్చారంటే తప్పక నెరవేరుస్తారన్నారు. జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, స్వామి, ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు గోరంట్ల రవీంద్ర, దామచర్ల సత్య తదితరులు శంఖారావం సభను విజయవంతం చేయాలని, కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న బాలాజీ, పక్కన సత్య, ఏలూరి, దామచర్ల, ఉగ్ర, స్వామి, పాపారావు, నాగేశ్వరరావు, స్వాములు

కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, పువ్వాడి వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి, వేమూరి రామయ్య, బొమ్మనబోయిన వెంగయ్య, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, భేరి పుల్లారెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొన్నలూరు (కొండపి), జనవరి 2 : కనిగిరిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 5న నిర్వహిస్తున్న ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేయాలని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. పొన్నలూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సభకు అన్ని గ్రామాల నుంచి అధికంగా కార్యకర్తలు హాజరుకావాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసగించిందని విమర్శించారు. ఆయా వర్గాలతోపాటు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, నాయకులు మండవ ప్రసాద్, నందికనుమ బ్రహ్మయ్య, పిల్లి వెంకట రమణారెడ్డి, సన్నమూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : కనిగిరిలో ఈనెల 5న నిర్వహిస్తున్న ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, పార్టీ బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల, నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. సభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు గుండపనేని రామ్మూర్తినాయుడు, పెట్లూరు ఉపసర్పంచ్ మూలె రామారావు, ఎస్సీసెల్ నాయకుడు యనమద్ది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు : టీడీపీ అధినేత చంద్రబాబు కనిగిరి సభను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల శంఖారావం మొదటి సభ ఈనెల 5న కనిగిరిలో నిర్వహిస్తున్నారని తెలిపారు. దీన్ని ప్రతి కార్యకర్త అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని జనసమీకరణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు తరలివచ్చేలా అందరినీ కార్యోన్ముఖులను చేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, ఉపాధ్యక్షుడు దయానందం, పార్టీ మండల కార్యదర్శి రవీంద్ర, ఎస్సీ సెల్ నాయకుడు బ్రహ్మానందం, పార్టీ సీనియర్ నాయకులు ఈదర ప్రభాకర్, బొజ్జా శ్రీనివాసరావు, పమిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

16 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లతో ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు, జనవరి 2 : మండలంలోని ఆలకూరపాడులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న పోకూరు వెంకటేశ్వర్లును ఎస్సై ఖాదర్‌బాషా అరెస్టు చేశారు. అతని వద్ద 16 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వర్లుతోపాటు మద్యం బాటిళ్లను స్టేషన్‌కు తరలించారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

బల్లికురవ, జనవరి 2: మండల పరిధిలోని అద్దంకి - నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడు రాయపూడి వెంకయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ముండ్లమూరు మండలం రమణారెడ్డిపాలెంకు చెందిన రాయపూడి వెంకయ్య బైకుపై బల్లికురవ మండలం సూరేపల్లి వస్తున్నాడు. ఈక్రమంలో కొప్పెరపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న వెంకయ్య 15 అడుగుల మేర ఎగిరి రోడ్డు మార్జిన్‌లోకి పడిపోయాడు. బాటసారులు ప్రమాదాన్ని గమనించి వెంటనే నామ్ రోడ్డు అంబులెన్స్‌కు సమాచారం అందించటంతో క్షతగాత్రుడిని నర్సారావుపేట వైద్యశాలకు తరలించారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

బల్లికురవ, జనవరి 2: మండలంలోని గుంటుపల్లి సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న గోళ్ల సుమలత తనను భర్త, అత్తమామలు, ఆడపడుచు వరకట్న వేధింపులకు గురిచేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.వేమన తెలిపారు. సుమలతకు కారంచేడుకు చెందిన గోళ్ల వెంకటేశ్వరరావుతో వివాహమైంది. భర్త మానసికంగా వేధింపులతో పాటు శారీరకంగా వేధిస్తున్నాడని పేర్కొంది. భర్తతో పాటు అత్తామామలు శ్రీనివాసరావు, విజయలక్ష్మి, ఆడపడుచు నాగమల్లేశ్వరి వరకట్నం కింద అధిక నగదు తీసుకు రావాలని తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని పేర్కొంది. ఈమేరకు మహిళా పోలీసు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలు

మార్టూరు , జనవరి 2 : జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తా పడి ఒకరికి గాయాలయ్యాయి. ఈసంఘటన సోమవారం అర్ధరాత్రి ఇసుకదర్శి పాండురంగస్వామి ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన సూరిబాబు తన ఆటోలో బాడుగ సామాన్లు తీసుకుని ఒంగోలు వెళ్లారు అక్కడ సామాన్లు దించి తిరిగి ఖాళీ ఆటోతో విజయవాడ వెళుతుండగా, అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఆటో డ్రైవర్ సూరిబాబుకు గాయాలు కాగా, 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నిలువునా మోసపోయిన నిరుద్యోగులు

పామూరు, జనవరి 2 : పాదయాత్ర సందర్భంగా ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని మాటిచ్చిన జగన్‌రెడ్డి ప్రకటించి యువతను నిలువునా మోసగించారని టీఎన్‌ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు అన్నారు. ఈ సందర్భంగా పోకా నాయుడు విలేకరులతో మాట్లాడుతూ మాయ మాటలతో మోసగించడం జగన్‌రెడ్డికి చెల్లిందన్నారు. ఏటేటా జాబ్ క్యాలెండర్ హామీ కొత్త సంవత్సరంలోనూ ప్రకటించలేదన్నారు. ఎన్నికలు వస్తున్నందున నోటిఫికేషన్ అంటూ మరో మోసానికి సిద్ధమవుతున్న జగన్‌రెడ్డికి యువత గట్టి గుణపాఠం చెప్పాలని పోకా పిలుపునిచ్చారు.

కార్మికులంటే సీఎంకు చులకనభావం

కడప టీడీపీ ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి

కనిగిరి, జనవరి 2 : కార్మికుల పట్ల జగన్‌కు చులకన భావం తగదని కడప ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కనిగిరిలో ఈనెల 5న చంద్రబాబు ఎన్నికల సమర శంఖారావం ప్రారంభ సభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికుల వద్దకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి వెళ్లి రాంభూపాల్‌రెడ్డి మద్దతు తెలిపారు.

సీఎం పదవికి జగన్ అనర్హుడు

అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తప్పుడు కేసులతో వేధింపులు

మాజీ మంత్రి పుల్లారావు



మాట్లాడుతున్న పుల్లారావు, పక్కన బాలాజీ, రవికుమార్, పాపారావు

దర్శి, జనవరి 2 : సీఎం పదవికి జగన్ అనర్హుడని, గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పుచేయని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి నిర్బంధించడం దారుణమన్నారు. ఈ సంఘటనతో ప్రజలు వైసీపీ పాలకులను అసహ్యించుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబుకు ప్రపంచ దేశాల్లో సైతం ఏ నాయకుడికీ లేని గుర్తింపు, సానుభూతి లభించిందన్నారు. వైసీపీ పార్టీలో సీట్ల కుమ్ములాట మొదలైందని, ఓటమి భయంతో ఏం చేయాలో పాలుపోక జగన్ సతమతమవుతున్నారని అన్నారు. కుటుంబ సభ్యులూ జగన్ తీరును తప్పుపడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా టీడీపీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతందని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఎవ్వరికీ రక్షణ లేకుండా పోయిందని ఆడపడుచులకు భద్రత కరువైందని పుల్లారావు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్ నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

ఫాం7 దరఖాస్తులు చేసిన నలుగురిపై కేసు

ఈఆర్‌వో వెంకటనారాయణ

పర్చూరు, జనవరి 2 : ఫాం7 ద్వారా బతికి ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు తప్పుడు దరఖాస్తు చేసిన మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పర్చూరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి వెంకటనారాయణ తెలిపారు. యద్దనపూడిలో ముగ్గురు వ్యక్తులతో పాటు పర్చూరులో మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో ఏర్పాటు చేసిన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 42,521 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అందులో ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫాం 7 ద్వారా 22,868 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 10,468 అనర్హతగా గుర్తించి తిరస్కరించినట్లు చెప్పారు. ఫాం 7కు సంబంధించి 12 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫాం 8కు సంబంధించి 65 దరఖాస్తులను విచారించాల్సి ఉందన్నారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి డిసెంబర్ 9వ తేదీలోపు వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. తదుపరి వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని చెప్పారు. విచారణకు 7వారాల గడువు నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటున్నట్టు చెప్పారు. అత్యధికంగా నమోదైన దరఖాస్తులను త్వరితగతిన విచారణ పూర్తిచేయటంతో ఇటీవల విజయవాడలో జరిగిన ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, కారంచేడు మండలాల తహసీల్దార్‌లు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకటనారాయణ

51 మందిపై కేసు నమోదు

నియోజకర్గ పరిధిలో తప్పుడు దరఖాస్తుచేసిన 51 మందిపై కేసు నమోదు చేసినట్టు ఈఆర్‌వో వెంకటనారాయణ తెలిపారు. అందులో బతికిఉన్న వ్యక్తులను చనిపోయినట్లు దరఖాస్తుచేసిన 18 మందిపై ఇప్పటికే కేసులు నమోదుచేసినట్టు చెప్పారు. తాజాగా మంగళవారం పర్చూరు, యద్దనపూడికి సంబంధించి మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దీంతోపాటు సైబర్ క్రైం ద్వారా తప్పుడు దరఖాస్తు చేసిన 28 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

బాబు సభను విజయవంతం చేద్దాం

- టీడీపీ వై.పాలెం ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు
- ప్రకాశం జిల్లా నుంచే ఎన్నికల శంఖారావం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జనవరి 2 : ప్రకాశం జిల్లా కనిగిరి నుంచే టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఎన్నికల శంఖారావం పూరించనున్నట్లు టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5న కనిగిరిలో చంద్రబాబునాయుడి సభను కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ, గ్రామాల్లో ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలన్నారు. అర్హులైన వారి ఓట్లు ఓటర్ల జాబితాలో తరుచుగా పరిశీలించాలన్నారు. టీడీపీకి ఓటు వేసేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకులు వేములకొండ శ్రీనివాసగౌడ్, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదరావు, యేర్వ మల్లికార్జునరెడ్డి, మెట్టు శ్రీనివాసరెడ్డి, మేకల వలరాజు, నియోజకవర్గంలోని ద్వితీయశ్రేణినాయకులు, కస్టరు ఇన్‌చార్జీలు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన 167 సీట్లు గెలిచి ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మార్కాపురం నియోజకవర్గ పరిశీలకులు జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని కందుల నారాయణరెడ్డి ఇంటి వద్ద మంగళ వారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో రూ.200 ఉన్న పించన్‌ను ఒక్కసారిగా రూ.1800 పెంచారని గుర్తు చేశారు. జగన్ ఐదేళ్లలో రూ.750 మాత్రమే పెన్షన్ పెంచారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై జగన్ అక్రమ కేసులు పెట్టి 52 రోజులు జైల్లో ఉంచారన్నారు. ఆయనకు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం కూడా చూపలేక పోయారన్నారు. విశాఖలో సభకు ప్రజల వద్ద నుండి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. సుమారు 5 లక్షల మంది ప్రజలు స్వచ్ఛందంగా సభలో పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని చంద్రబాబు హయాంలో అభివృద్ధి పథంలో నడిపారన్నారు. జగన్ అడిగిన ఒక్క అవకాశం రాష్ట్రం ప్రజలు ఇవ్వడంతో రాష్ట్రాన్ని నాశనం చేశాడన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పంచాయతీలలో నిధులు లేక సర్పంచులు చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక, మద్యంలో ప్రభుత్వం ప్రజల వద్ద నుండి అక్రమంగా దోచుకుతింటోందన్నారు. అంతకు ముందు నారాయణరెడ్డి నివాసంలో మార్కాపురం, తర్లుపాడు మండలాల పార్టీ కార్యకర్తలతో మంగళవారం చంద్రబాబుసభ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి 25వేల మందికి పైగా కార్యకర్తలు హాజరు కావాలన్నారు.





మాట్లాడుతున్న జీవీ.ఆంజనేయులు, హాజరైన కార్యకర్తలు

కనిగిరి సభను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5న కనిగిరి పట్టణంలో జరిగే చంద్రబాబునాయుడి సభను విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ప్రతి కార్యకర్తలు సమష్టి కృషితో జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వై.నాగేశ్వరరావు, రామలింగారెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ వక్కలగడ్డ మల్లికార్జున, పట్టణ అధ్యక్షులు మౌలాలి, మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజులరెడ్డి, తర్లుపాడు అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కాకార్ల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, గోపీనాథ్ చౌదరి, శేఖర్‌రెడ్డి, మార్కాపురం, తర్లుపాడు, పట్టణ, మండల, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

తహసీల్దార్, వీఆర్‌వోలపై ఫిర్యాదు

- భూ కబ్జాదారులకు వంతపాడుతున్నారని ఆరోపణ
- సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత నేతల ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న దళితనాయకులు

మార్కాపురం రూరల్, జనవరి 2: మండలంలోని భూ కబ్జాదారులకు వంత పాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి, వీఆర్‌వో బడేసాబ్‌లపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ మండలంలోని ఇడుపూరు గ్రామ ఇలాకాలోని సర్వే నెంబర్ 1089/3లోని 3.88 ఎకరాల ప్రభుత్వ భూమిని కొండ్రు వెంకటయ్యకు ప్రభుత్వం డీకే పట్టా ఇచ్చింది. 2019లో కొండ్రు వెంకటయ్య చనిపోగా ఆయన కుమార్తె కొండ్రు నాగమ్మకు హక్కులు కల్పించారన్నారు. అయితే ఆ పొలాన్ని ఒక గ్రామంలోని కొందరు వ్యక్తులు ఆక్రమించారన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఎన్ని సార్లు నివేదించుకున్న న్యాయం జరగలేదన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.

లైఫ్ సర్టిఫికెట్ నమోదు

గిద్దలూరు, జనవరి 2 : పట్టణంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్ నమోదు కార్యక్రమాన్ని ట్రెజరీ అధికారి వరకుమార్ ప్రారంభించారు. రిటైర్డ్‌ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, సంఘ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, రామచంద్రరెడ్డి, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యసురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ తులసమ్మ

కంభం, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం ఉచితంగా నిర్వహిస్తున్న ఆరోగ్యసురక్ష కార్య క్రమాన్ని గ్రామాల్లో, మండలాల్లో వినియోగించుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ తెలి పారు. ఎల్.కోట ఎంపీపీ స్కూల్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ తులసమ్మ మాట్లాడుతూ పేద ప్రజలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. నిపుణులైన వైద్యులను గ్రామాల్లోకి తీసుకురావడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. 100 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్.కోట సర్పంచ్ మహమ్మద్ బాషా, ఉపసర్పంచ్ ఖాశీం, ఎంపీటీసీ సభ్యుడు రవీంద్రనాథ్, ఎంపీడీవో ప్రసాద్‌బాబు, చేగిరెడ్డి ఓబులరెడ్డి, పాల్గొన్నారు.

రాములవారి అక్షతల గ్రామోత్సవం



రాముని అక్షతలతో గ్రామస్థులు



మార్కాపురంలో అక్షతలతో గ్రామోత్సవం

కొమరోలు, జనవరి 2: ఆయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షతలను స్థానిక ఆర్యమరాఠి కాలనీలోని శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయం నుంచి మరాఠికాలనీలో కమిటీ సభ్యులు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతి ఇంటికి రాముని అక్షింతలను అందించేందుకు కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళలు ఉత్సవానికి ముందు పసుపు నీళ్ళతో వారుపోసి స్వాగతం చెప్పారు. కార్యక్రమంలో దేవాలయం అద్యక్షులు పెనుగొండ వెంకట రమణ, రంగారావు, మోతె రమణ, కదం శావాజి, రామక్రిష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అక్షతలు పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2: అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా గాంధీ బజార్ రామాలయంలో ఉంచిన అక్షతలను ఇంటింటికి పంచడానికి గ్రామాలయ మహిళాసేవాసంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేశారు.

ప్రతిఒక్కరూ మొక్క నాటాలి - పెంచాలి



మొక్కనాటుతున్న చిన్ని సేవాసంస్థ ప్రతినిధులు

గిద్దలూరు, జనవరి 2 : మండలంలోని సంజీవరాయునిపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్ని సేవాసంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యానికి మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి నీరు పోసి పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, పూర్వవిద్యార్థులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వేములకోటలో చెరుకు తోట దగ్ధం

- రెండున్నర లక్షల మేర రైతుకు నష్టం



మంటలకు దగ్ధమైన చెరుకు తోట

మార్కాపురం రూరల్, జనవరి 2: ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి చెరుకు తోట దగ్ధమైన ఘటన మండలంలోని వేములకోట గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వేములకోట గ్రామానికి చెందిన జనుమాల ప్రసాద్ 1.5 ఎకరాల్లో చెరుకు సాగు చేశాడు. ఆయన చెరుకు తోట పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారి పిచ్చి కంపను తగలబెడుతున్న క్రమంలో మంటలు వ్యాపించాయి. దీంతో కోతకు వచ్చిన చెరుకు తోట దగ్ధమైంది. సుమారు రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు. సంబంధిత అధికారులు పంటను పరిశీలించి ప్రభుత్వం నుంచి సహాయాన్ని అందించాలని రైతు కోరారు.

తెలుగు మహాసభలు జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2: అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవి చంద్రకుమార్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు మహాసభల ఆహ్వాన పత్రికలను ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, విద్యావేత్త ఏ.వీరారెడ్డిలకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర, పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్‌బాబులు మాట్లాడారు. 'ఆంధ్ర మేవ జయతే' అనే నినాదంతో తెలుగుబాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో ఈనెల 5, 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య సేవలకు సాయం అందిస్తాం

- రెడ్‌క్రాస్ మార్కాపురం శాఖ చైర్మన్ కనకదుర్గ



పల్స్ ఆక్సీమీటర్లు అందజేస్తున్న డాక్టర్ కనకదుర్గ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 2: ప్రజారోగ్యం కోసం అవసరమైన సేవలు అందిస్తామని రెడ్‌క్రాస్ మార్కాపురం శాఖ ఛైర్మన్ డా.చెప్పల్లి కనకదుర్గ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో పట్టణంలోని ఏఎన్‌ఎంలకు ఆక్సిజన్ పల్స్ ఆక్సీమీటర్లు మంగళవారం పంపిణీ చేశారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్‌హెన్రీ డ్యునెంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రథమచికిత్సపై, వివిధ అంశాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. పల్స్‌ఆక్సీ మీటర్లు అత్యవసర సమయంలో ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు వెంటనే చికిత్స అందించేందుకు తోడ్పాటుగా ఉందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు కొల్లి విజయ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 18 ఎస్సీ కుటుంబాలు చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు, జనవరి 2 : టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా కొమరోలు మండలం ఇడమకల్లు గ్రామానికి చెందిన 18 ఎస్సీ కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. గిద్దలూరులోని టీడీపీ కార్యాలయంలో వీరందరికీ టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో బద్దేటి మోహన్‌రావు, మల్లెపోగు అశోక్‌కుమార్, ఏసోబు, ఏసుదాసు, ప్రకాశ్, నరసయ్య, తదితరులు ఉన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, టీడీపీ మండల యూత్ అధ్యక్షులు నభి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఎరిక్షన్‌బాబు నివాళి



నివాళి అర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, జనవరి 2: అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కొమ్ము అశోక్ మృతదేహానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు నివాళి అర్పించారు. అనంతరం అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. టీడీపీ మండలాధ్యక్షుడు, పయ్యావుల ప్రసాద్, టీడీపీ నాయకులు గజ్వేల్లి భాస్కర్, కాకర్ల కోటయ్య, మేడికొండ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దున్నపోతుకు అర్జీలు ఇచ్చి అంగన్‌వాడీల నిరసన





గిద్దలూరు, మార్కాపురంలలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గిద్దలూరు, జనవరి 2 : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా, దున్నపోతుకు అర్జీ ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద సామూహిక ధర్నా చేయనున్నామని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ యూని యన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, విజయలక్ష్మి, కొండమ్మ, సీఐటీయూ నాయ కులు కొండమ్మ, ఆవులయ్య పాల్గొని ప్రసంగించారు.

పెద్ద దోర్నాల : అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండు వద్ద తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నిర్వహిస్తున్న నిర్వధిక సమ్మె మంగళవారం కొనసాగింది. సమ్మెకు మద్దతు తెలిపిన రఫీ మాట్లాడుతూ.. గత ఇరవై రోజులకు పైగా అంగన్‌వాడీ మహిళలందరూ వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉద్యోగభద్రత కల్పించాలని, 26వేలు వేతనంగా ఇవ్వాలని, 62ఏళ్లకు రిటైర్మెంట్ పొడిగించాలని తదితర న్యాయమైన కోరికలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విశ్వరూపాచారి, బాణాల రామయ్య, పీ.తిరుమలయ్య, వెంకటలక్ష్మీ, సుబ్బమ్మ, వెంకటరత్నం, షేక్ ముంతాజ్ బేగం, భారతి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : గత 22 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు అలుపెరుగని పోరాటాలు చేస్తున్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాసరయ్య, రూబెన్, రేణుక, వెంకటరత్నం పాల్గొన్నారు. సమ్మెలో భాగంగా పొదిలిలోనూ దున్నపోతకు వినతిపత్రం అందజేశారు.

ఎర్రగొండపాలెం : వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసరాలు మొదలుకొని విద్యుత్తు చార్జీలు అన్ని పెంచారని, ఇలాంటి తరుణంలో తమ జీతాలు పెరగకపోతే తాము ఎలా జీవించాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నించారు. అగన్‌వాడీల సమ్మె 22వ రోజు ఎర్రగొండపాలెంలో కొనసాగింది. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో అంగన్వాడీల సత్తా ఏమిటో చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్& హెల్పర్స్ యూనియన్ నాయకులు జి మల్లేశ్వరి, పి సుబాషిణి, నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ, సునీత, తలపాటి సుబ్బమ్మ, సుజాత, విజయలక్ష్మి, రూత్ మేరి, రామకుమారి, తిరుపాలమ్మ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



గిద్దలూరులో ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

గిద్దలూరు, జనవరి 2 : డిమాండ్ల పరిష్కారం కోసం 8 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు మంగళవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగయ్య, మౌలాలి, మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం, అధికారులు బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మురళీ, మస్తాన్‌రెడ్డి, పుల్లయ్య, రంగస్వామి, సీఐటీయూ నాయకులు ఆవులయ్య పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదురు కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోంద న్నారు. వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికులు సుబ్బ రాయుడు, గొట్టం హరి, ఇమాం సాహెబ్, దూపాటి మహేష్, సలాంఖాన్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం కొనసాగింది. దీంతో పలువీధులు మురికి కూపాలుగా మారాయి. దీంతో అధికారులు ప్రైవేటు కార్మికులతో చెత్తశుభ్రం చేయించే కార్యక్రమం చేపట్టారు. అయితే ప్రభుత్వం తమను మరో రూపంలో దెబ్బకొట్టేందుకు ప్రయత్నిస్తోందని వాపోయారు. ప్రైవేటు కార్మికులు చేపడుతున్న పనులను అడ్డుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా తమ కడుపుకొట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఏదిఏమైనా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. కాదని అధికారులు ప్రైవేటు కార్మికులను తీసుకొస్తే సహించేది లేదన్నారు. మున్సిపల్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ పెద్దబస్టాండ్ వరకు నిరసన చేపట్టారు.

శంఖారావం సభకు తరలిరావాలని పిలుపు

- జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు టీడీపీవే మాజీ ఎమ్మెల్యే దామచర్ల
- ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

కనిగిరి, జనవరి 2 : ప్రకాశం జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడమే టీడీపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అన్నారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో చంద్రబాబు ఎన్నికల సమర శంఖారావం తొలి సభ ఏర్పాట్లను మంగళవారం ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఇన్‌చార్జిలు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఏలూరి సాంబశివరావు, దామచర్ల సత్య, నారపశెట్టి పాపారావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, బాలవీరాంజనేయస్వామి, ఎరిక్షన్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, ఐఓఎం కళాశాల చైర్మన్ గోరంట్ల రవీంద్రతో కలసి జనార్దన్ పరిశీలించారు. రాష్ట్రంలో ఎన్నికల సమర శంఖారావం తొలి సభ కనిగిరిలో ఏర్పాటు చేయడం వెనుక జిల్లాపై, కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని సభ విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని జనార్దన్ కోరారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే ఆంధ్రరాష్ట్రం కనుమరుగైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల విజయవంతానికి ప్రకాశం జిల్లా పాజిటివ్ ఎనర్జీని ఇస్తుందన్నారు. ఇటీవల ఒంగోలులో మహానాడు, యువగళం నెలివర్ల ముగింపు సభ విజయవంతంలో డాక్టర్ ఉగ్ర చూపిన చొరవ, కృషి బాబు మనసులో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఆ కారణంగా కనిగిరిలో తొలి ఎన్నికల సమర శంఖారావం సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సభకు రెండు లక్షల మందికి పైగా వచ్చే అవకాశం ఉందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి చెందాలన్నాదే తన సంకల్పమన్నారు. ఎన్నికల శంఖారావం సభలో చంద్రబాబును కనిగిరి ప్రాంతానికి అవసరమైన వాటిని రాబట్టేందుకు మంచి వేదిక ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు, యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. శంఖారావం సభలో చంద్రబాబుకు కనిగిరి ప్రాంతానికి వీటి అవసరం ఉందని తెలియజెప్పాలంటే అశేషంగా ప్రజలు సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు హామీ ఇచ్చారంటే తప్పక నెరవేరుస్తారన్నారు. జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, స్వామి, ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు గోరం ట్ల రవీంద్ర, దామచర్ల సత్య తదితరులు శంఖారావం సభను విజయవంతం చేయాలని, కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, ఫువ్వాడి వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి, వేమూరి రామయ్య, బొమ్మనబోయిన వెంగయ్య, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, భేరి పుల్లారెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

మురికి కూపం- దుర్గంధభరితం

- పొదిలిలో పడకేసిన పారిశుధ్యం
- కొలిక్కిరాని మున్సిపల్ కార్మికుల సమ్మె
- అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం

పొదిలి, జనవరి 2 : పారిశుధ్య కార్మికుల సమ్మెతో పొదిలి పట్టణంలో ఎక్కడికి అక్కడ చెత్త పేరుకుపోయింది.





జూనియర్ కళాశాల రెండవలైన్ సమీపంలో, వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద చెత్త

నిత్యం జనసంచారం ఉండే వీధులలో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధభరితంగా మారింది. దీంతో దోమలుపెరిగి స్థానికులకు కంటిమీదకునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా పాదచారులు ముక్కు మూసుకొని నడవాల్సిన పరిస్థితి నెలకొంది. చెత్త పేరుకుపోవడంతో పందులు, కుక్కలు సంచారం పెరిగి ప్రజలకు అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా జనావాసాలమధ్య చెత్తపేరుకుపోవడంతో వీదు చెత్త దిబ్బ లను తలపిస్తున్నాయి. మురికి కాలవల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు కొన్నివీధుల్లో రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుంది. పట్టణంలో పరిస్థితి ఇలా ఉండగా శివారు కాలనీల్లో మరింత అధ్వా న్నంగా తయారైంది. పట్టణంలోని విశ్వనాథపురం కళాశాల రోడ్డు, రెండవ లైన్‌లో ఇళ్ళమధ్యలో గతంలో చెత్తకుండి ఏర్పాటు చేయడంతో ఆ వీదుల్లో నివాసం ఉండేవారు చెత్తవేయడంతో పెద్ద దిబ్బను తలపిస్తోంది. అదేవిధంగా ఆల్ఫా పాఠశాల, రామాలయం వెనుక బజారు, పవర్‌ఆఫీస్‌కు వెళ్లే ప్రధాన రహదారి, ఇమాంమ్ సా హాస్పిటల్, పాతూరులోని రాఘవేంద్ర సినిమాహాల్, ఆంధ్రాబ్యాంక్‌లైన్, వేణుగోపాలస్వామి దేవాలయం ఎదురుగా, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, తహశీల్దార్ కార్యాలయం, పెద్దమసీదు దగ్గర ఇలా పట్టణం మొత్తం చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే గ్రామలు, పట్టణంలో వాతావరణ మార్పుతో ఇప్పటికే జలుబు, జ్వరాలు, ఒళ్లునొప్పులతో ప్రజలు వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో కార్మికులు సమ్మెకు దిగడంతో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో కొత్తగా వ్యాదులు ఏమి వస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చెత్తపేరుకుపోయి ప్రజల ఆరోగ్య సంరక్షణ దెబ్బతింటున్నప్పటికీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మెపై చొరవచూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీంతో ప్రభుత్వ తీరుపై పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మునిసిపల్ కార్మికుల సమస్యలపై స్పందించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురు ఉన్న చెత్త

సీఎం పదవికి జగన్ అనర్హుడు

- అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తప్పుడు కేసులతో వేధింపులు
- మాజీ మంత్రి పుల్లారావు

దర్శి, జనవరి 2 : సీఎం పదవికి జగన్ అనర్హుడని, గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పుచేయని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి నిర్బంధించడం దారుణమన్నారు. ఈ సంఘటనతో ప్రజలు వైసీపీ పాలకులను అసహ్యించుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబుకు ప్రపంచ దేశాల్లో సైతం ఏ నాయకుడికీ లేని గుర్తింపు, సానుభూతి లభించిందన్నారు. వైసీపీ పార్టీలో సీట్ల కుమ్ములాట మొదలైందని, ఓటమి భయంతో ఏం చేయాలో పాలుపోక జగన్ సతమతమవుతున్నారని అన్నారు. కుటుంబ సభ్యులూ జగన్ తీరును తప్పుపడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా టీడీపీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతందని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఎవ్వరికీ రక్షణ లేకుండా పోయిందని ఆడపడుచులకు భద్రత కరువైందని పుల్లారావు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశం లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్ నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగించిన జగన్‌రెడ్డి

పామూరు, జనవరి 2 : పాదయాత్ర సందర్భంగా ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని మాటిచ్చిన జగన్‌రెడ్డి ప్రకటించి యువతను నిలువునా మోసగించారని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు అన్నారు. ఈ సందర్భంగా పోకా నాయుడు విలేకరులతో మాట్లాడుతూ మాయ మాటలతో మోసగించడం జగన్‌రెడ్డికి చెల్లిందన్నారు. ఏటేటా జాబ్ క్యాలెండర్ హామీ కొత్త సంవత్సరంలోనూ ప్రకటించలేదన్నారు. ఎన్నికలు వస్తున్నందున నోటిఫికేషన్ అంటూ మరో మోసానికి సిద్ధమవుతున్న జగన్‌రెడ్డికి యువత గట్టి గుణపాఠం చెప్పాలని పోకా పిలుపునిచ్చారు.

శంఖారావం సభను విజయవంతం చేయాలి

మాజీ మంత్రి పుల్లారావు పిలుపు

దర్శి, జనవరి 2 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శంఖారావం బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు తరలిరావాలని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు కోరారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన దర్శి నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈనెల 5న కనిగిరిలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారని పుల్లారావు తెలిపారు. వైసీపీ పాలన పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఆయన అన్నారు. వైసీపీ పాలకుల అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాల పట్ల ప్రజలు విసుగు చెందారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన విషయాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. జగన్‌రెడ్డి అవలంబిస్తున్న కక్షపూరిత వైఖరిపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దర్శి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండలాలవారీగా నాయకులు, కార్యకర్తలతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి, కురిచేడు, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు చిట్టే వెంకటేశ్వర్లు, నెమలయ్య, నాగులపాటి శివకోటేశ్వరరావు, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, దర్శి క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, మాజీ ఎంపీపీలు మండలపు వెంకటరావు, పణిదపు వెంకటరామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పుల్లారావు, పక్కన బాలాజీ, పాపారావు

పామూరు : కనిగిరిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే శంఖారావం సభకు భారీ ఎత్తున తరలివెళ్లేలా నాయకులు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు. శేష మహల్ ప్రాంగణంలో మంగళవారం రాష్ట్ర నాయకుడు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మొట్టమొదటి సారిగా ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని కనిగిరిలో జరిగే ఎన్నికల సభకు వెలిగొండ సాధన సభ ప్రాంగణంగా నామకరణం చేసారని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి అందరూ ఐక్యంగా శ్రమించాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ జీ దశరథరాములు, టీడీపీ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శులు సయ్యద్ అమీర్‌బాబు, ఆర్ఆర్‌రఫి, షేక్ ఖాజారహంతుల్లా, వై.రహీముల్లా, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.హంసేన్‌యాదవ్, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి హరిబాబు, షేక్ గౌస్‌బాషా, పందిటి హరీష్, సీనియర్ నాయకులు పచ్చా పేరయ్య, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎన్.సాంబయ్య, యారవ శ్రీను, పువ్వాడి వెంకట్‌చౌదరి, ఎం.రమణయ్య, దేవరపు మాల్యాద్రి, చినహజరత్, యాదాల మాలకొండయ్య, సత్యం, కంచర్ల శ్రీను, ఎన్.నాగేంద్రచారి, మోషే, కౌలూరి రహంతుల్లా, టీవీకే సుబ్బారావు, పత్తుమస్తాన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పూనాటి వెంకటేశ్వర్లు, దారపనేని మాధవరావు, గట్ల కొండారెడ్డి, గిద్దయ్య, పగడాల మాలి, జనసేన మండల కార్యదర్శి దరిశి ఏడుకొండలు, షేక్ సంధాని బాషా,ముత్తు, రమణమ్మ, రమాదేవి, బేగం పాల్గొన్నారు.

వెలిగండ్ల : కనిరిలో పాలకేంద్రం వద్ద ఈనెల 5న నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు మంగళవారం టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్నారని తెలిపారు. పెద్ద సంఖ్యలో శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గొనా ప్రతాప్, మండల ఉపాధ్యక్షుడు మోటాటి సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సలోమన్ రాజు, తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్ రెడ్డి, కేలం చంద్రశేఖర్ రెడ్డి, అక్కి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పువ్వాడి


మాట్లాడుతున్నా వెంకట సుబ్బారెడ్డి


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న రాంభూపాల్‌రెడ్డి, ఉగ్ర

కార్మికులపై జగన్‌కు చులకన భావం

కడప టీడీపీ ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి

కనిగిరి, జనవరి 2 : కార్మికుల పట్ల జగన్‌కు చులకన భావం తగదని కడప ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కనిగిరిలో ఈనెల 5న చంద్రబాబు ఎన్నికల సమర శంఖారావం ప్రారంభ సభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికుల వద్దకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి వెళ్లి రాంభూపాల్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పారిశుధ్య కార్మికుల జీవనం కష్టంగా మారిందన్నారు. వేతనాలు పెంచి రెగ్యులర్ చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికలకు ముందు కల్లబొల్లి హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాక జగన్‌రెడ్డి విస్మరించారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి రాగానే పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలపై పోరాటం రాజ్యాంగ హక్కు అన్నారు. వైఫల్యాలపై గొంతెత్తితే జగన్‌రెడ్డి అక్రమ కేసులతో భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. పథకాల ప్రచారానికి మాత్రం వచ్చిన స్థానిక ఎమ్మెల్యే తమను పట్టించుకోలేదని కార్మికులు ఉగ్ర, రాంభూపాల్‌కు తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులకు ఇంటి స్థలాలు ఇచ్చినట్లు ఉగ్ర గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖాదర్‌వలి, ప్రసాద్, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, భేరి పుల్లారెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, గుడిపాటి ఖాదర్, ఫిరోజ్ పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు



కురిచేడు, జనవరి 2 : కురిచేడును మంగళవారం ఉదయం మంచు కప్పేసింది. ఉదయం 6 గంటల వేళ లేని మంచు 7 గంటలకు ఉధృతంగా కమ్మేసింది. రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకుండా మంచు కురిసింది. వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణం చేశారు. ఉదయం 7.30 గంటల సమయంలో చాలా వాహనాలు రోడ్డు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక రోడ్డు పక్కగా ఆపుకున్నారు. 9 గంటల తరువాత భానుడు కనపడిన తరువాత మంచు కొద్దికొద్దిగా కనుమరుగు అయింది.

ఇంటింటికీ శ్రీరాముని అక్షతలు

పామూరు, జనవరి 1 : అయోధ్య శ్రీరాముని కల్యాణ అక్షతలను శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, దేవస్థాన అధ్యక్షుడు బాకొండలరావు, గుత్తి రాజ, హరిబాబు, శివ, వరద ఓబులేసు, ధైండే తిరుపతయ్య పాల్గొన్నారు.

దొనకొండ : అయోధ్య ట్రస్ట్ నుంచి ఆనంద ఆశ్రమానికి వచ్చిన శ్రీరాముని అక్షతలు మంగళవారం ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి గ్రామాలకు తరలించారు. ఈ సందర్భంగా భైరవానందస్వామి మాట్లాడుతూ 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అక్షతలు, కరపత్రాలు, రామాలయ నిర్మాణం గ్రీటింగ్‌కార్డు అయోధ్య నుంచి వచ్చినట్లు తెలిపారు. ఇంటింటికీ 10 గ్రాముల అక్షతలు పంపిణీ చేయాలని కోరారు.

పలువురిని పరామర్శించిన బూచేపల్లి

తాళ్లూరు, జనవరి 2 : అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మాధవరం గ్రామంలో కొడిమెల వెంకట్రావు ఇద్దరు కుమారులు వింత వ్యాధితో నడవలేని స్థితిలో ఉండగా వారిని పరామర్శించారు. చికిత్స చేయించేందుకు స్తోమతలేక ఇబ్బందులుపడుతున్నామని కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వైద్యం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. తన వంతుగా రూ.25వేల సాయం అందజేశారు. మాధవరంలో దివ్యాంగుడైన కొడిమెల సుబ్బయ్య తనకు మూడు చక్రాలసైకిల్‌ను మంజూరు జేయాలని కోరగా అందజేస్తామన్నారు. గ్రామంలో మానసిక దివ్యాంగులు సాయం చేయాలని కోరగా అందజేస్తామన్నారు. గ్రామంలో వైసీపీ నేత సోము శివారెడ్డి తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ సీనియర్ నేత శివరాంపురం గ్రామ ఉపసర్పంచ్ నారిపెద్ది రామ్మూర్తి తల సంబంధమైన ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దే చికిత్స పొందుతుండగా పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, కోటరామిరెడ్డి, జి.మోషే, సర్పంచ్ చిమట సుబ్బారావు, మాజీ సర్పంచ్ కోట పెద్దిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, జక్కుల రామకృష్ణ పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి

ప్రతి ఒక్కరినీ ఆదరించడమే లక్ష్యం

పింఛన్‌ల పంపిణీలో ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్

కనిగిరి, జనవరి 2 : ప్రతి ఒక్కరినీ ఆదరించటమే లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పింఛన్‌లను పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎమ్మెల్యే పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గఫార్, వైస్ ఛైర్మన్ పులి శాంతి, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, కౌన్సిలర్‌లు, ఎంపీడీవో మల్లికార్జునరావు, ఎంపీపీ ప్రకాశం, ఎంపీటీసీలు, ఏఎంసీ ఛైర్మన్ సాల్మనరాజు, నాయకులు రంగనాయకులరెడ్డి, చింతం శ్రీనివాసులుయాదవ్, వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, శ్రీనివాసులుయాదవ్, దాసరి మురళీయాదవ్, పులి శ్రీను, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, పసుపులేటి దీప, రిజ్వాన, దేవకి సత్యవతి, దేవరాజ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలి

దొనకొండ, జనవరి 2 : ప్లాస్టిక్ నిషేధంపై గ్రామాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వాడకాన్ని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి సూచించారు. దొనకొండలోని అన్ని రకాల దుకాణాలలో మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టి ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న పలువురుని గుర్తించి వారికి జరిమానాలు విధించారు. ఇదేవిధంగా అన్ని గ్రామాల్లో తనిఖీలు చేపట్టి ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్యాణ మండపాలు, రెస్టారెంట్లు దుకాణాల వద్ద ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని రానున్న రోజుల్లో ప్లాస్టిక్ కనుమరుగయ్యేలా అధికారులు బాధ్యతగా చర్యలు చేపట్టాలన్నారు. క్లాత్ బ్యాగ్స్, జూట్ బ్యాగ్‌లు ఉపయోగించుకునేలా గ్రామ కార్యదర్శులు, విస్తరణాధికారులు చైతన్యం కల్గించాలని సూచించారు. ముందుగా రుద్రసముద్రం గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ సునీత పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఫేజ్-2 ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీ వసంతరావునాయక్, విస్తరణాధికారి వైవీడీ ప్రసాద్, దొనకొండ కార్యదర్శి కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

పామూరు, జనవరి 2 : తెలుగు బాప్టిస్ట్ చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా సండే స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాత రాచూరి ఏలియా సమకూర్చిన బహుమతులను ఏపీజీ బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఆర్.జోసెఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి

పామూరు, జనవరి 2 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీడీవో వీ శ్రీనివాసులు తెలిపారు. బోడవాడ గ్రామ సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జే చినసుబ్బయ్య, ఏవో కే రాధ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

దున్నపోతుకు అంగన్‌వాడీల వినతి

దర్శి జనవరి 2 : డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళనల్లో భాగంగా మంగళవారం 22వ రోజు వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంగన్‌వాడీలు సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ దర్శి నియోజకవర్గ నాయకుడు రంగారావు మాట్లాడుతూ కార్యకర్తలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 22 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా జగన్‌రెడ్డి పట్టించుకోకుండా మొద్దు నిద్ర పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు నిర్లక్ష్యవైఖరి వీడి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 3వ తేదీన కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అచ్చమాంబ, తిరుపతమ్మ, బాలమ్మ, నాగజ్యోతి, ప్రశాంతి, సుజాత, అజిత, లక్ష్మీ, ఫాతిమా, వెంకట రమణ, విశ్వవాణి, సీఐటీయు నాయకులు నారాయణ, మోహన్‌రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


నిరసన ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు

జగన్ వైఖరి దున్నపోతుపై ఈగ వాలినట్లుగా ఉంది..!

కనిగిరి : జగన్‌రెడ్డి వైఖరి దున్నపోతుపై ఈగ వాలినట్లుగా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు అన్నారు. సమ్యలపై పరిష్కారం కోసం నిరసనలు చేస్తున్న అంగన్‌వాడీలు మంగళవారం దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. కేశవరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం 20 రోజులకు పైగా మహిళలు రోడ్లపై ఆందోళనలు చేస్తుంటే ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులకు పట్టకపోవడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చేందుకు అంగన్‌వాడీలకు హామీలు ఇచ్చిన జగన్ మాటతప్పి మోసగించారన్నారు. చాలీచాలని జీతాలతో, పెరిగిన నిత్యావసరాల ధరలతో నానా యాతనలు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే అంగన్‌వాడీలపై కక్షసాధింపు ధోరణి అనుసరించడం బాధాకరమన్నారు. ఈ ధోరణి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, రజిని, సీత, రామసుబ్బులు సౌందర్య, వర్కర్‌లు, హెల్పర్‌లు, నాయకులు పాల్గొన్నారు.


కనిగిరిలో దున్నపోతుకు వినతిని ఇస్తున్న వర్కర్లు

జాతీయ స్థాయి ఎడ్ల పోటీల నిర్వహణ ఆనందదాయకం

దర్శి, జనవరి 2 : జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించడం ఆనందదాయకమని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో దర్శిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించే స్థలాన్ని పుల్లారావు మంగళవారం పరిశీలించారు. దర్శిలో జరిగే టీడీపీ విస్తృత స్థాయి సమావేశానికి వచ్చిన ఆయన వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలు జరిగే ప్రదేశాన్ని సందర్శించారు. పోటీల వివరాలను వెంకట్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలు అన్ని విషయాల్లోనూ కలిసి పనిచేయాలని సూచించారు. ఇక్కడ ఎవరికి సీటు ఇచ్చినా అభ్యర్థి విజయం కోసం సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఆయన వెంట దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్, పలువురు జనసేన, టీడీపీ నాయకులు ఉన్నారు.


పోటీలు నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి పుల్లారావు, జనసేన పార్టీ నేత వెంకట్

చంద్రబాబు సభకు చకచకా ఏర్పాట్లు..!

- పరిశీలించిన టీడీపీ ఇన్‌చార్జిలు
- హెలిప్యాడ్ సిద్ధం
- వెలిగొండ సాధన ప్రాంగణ సభగా నామకరణం

కనిగిరి, జనవరి 2: కనిగిరిలో ఈనెల 5న చంద్రబాబు ఎన్నికల సమర శంఖారావం తొలి సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో చకచకా సాగుతున్నాయి. జిల్లా ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కనిగిరి - సీఎస్‌పురం వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో కనిగిరి పట్టణానికి అతి సమీపంలో చాకిరాల వద్ద చంద్రబాబు సమర శంఖారావం సభకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఈ సభకు వెలుగొండ సాధన ప్రాంగణ సభగా ఉగ్ర నామకరణం చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సభావేదిక ఏర్పాటుకు ఎలాంటివి అడ్డు లేకుండా ఉండేలా డాక్టర్ ఉగ్ర ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. చంద్రబాబు సభావేదిక వద్దకు వచ్చేందుకు ప్రాంగణానికి అతి సమీపంలోనే హెలిప్యాడ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే హెలిప్యాడ్ ఏర్పాటుకు కాంక్రీట్‌తో కట్టుదిట్టంగా వేయిస్తున్నారు. అందుకు ప్రత్యేక పర్యవేక్షకులతో హెలిపాడ్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా సభా ప్రాంగణం వద్ద ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే సభాప్రాంగణం అంతా చదును చేయించారు. ప్రాంగణం వద్దకు ప్రజలు వచ్చేందుకు ప్రధానరోడ్డు నుంచి ప్రత్యేకంగా దారి మళ్లింపులు చేపట్టారు. వాహనాల పార్కింగ్ కోసం పామూరు రోడ్డుతో పాటు, సీఎస్‌పురం రోడ్డు వెంబడి ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. హెలిప్యాడ్‌ను కాంక్రీట్‌తో చేస్తుండగా జిల్లాలోని ఇన్‌చార్జిలు దామచర్ల జనార్దన్, దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, గూడూరి ఎరిక్షన్‌బాబు, ముత్తుముల అశోక్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నారపశెట్టి పాపారావు, గోరంట్ల రవీంద్ర పరిశీలించారు. సభా ఏర్పాట్లపై డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని వారు అభినందించారు.


శంఖారావం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 3 జనవరి 2024





రేపల్లె: 5వ వార్డులో పేరుకు పోయిన చెత్తాచెదారం



ఇక పంచాయతీ.. పోరు?

- ఆందోళనలకు సిద్ధమైన కార్యదర్శులు
- విలువలేని ఉద్యోగాలతో అవమానాలు
- జీవో ఉన్నా విధులు ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా వెట్టిచాకిరి
- సమ్మెతో న్యాయం జరుగుతుందన్న భావనలో ఉద్యోగులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విధులు లేవు.. విలువ లేదు.. అవమానాలు.. వెట్టిచాకిరీ ఉద్యోగాలపై.. గ్రామ సచివాలయాల్లోని గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులు పోరాటానికి సన్నద్ధమవుతున్నారు. అధికారాలు ఇస్తామని 2022లోనే ప్రభుత్వం జీవో 149 విడుదల చేసినా అవి పేపర్లకే పరిమితం కావడంతో కార్యదర్శులు రెండేళ్లుగా ఆందోళన చేస్తున్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అంగన్వాడీ, ఆశ, మున్సిపల్ కార్మికుల ఆందోళనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో తమ డిమాండ్లు నెరవేరేందుకు ఇదే సరైన సమయమని భావించిన ఉద్యోగులు ఉద్యమానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

అస్తవ్యస్తం.. గందరగోళం

గ్రామ సచివాలయ ఉద్యోగుల నియామక ప్రక్రియ ఆది నుంచి అస్తవ్యస్తంగానే ఉంది. పంచాయతీరాజ్ చట్టం పరిధిలో గ్రామ పంచాయతీ విధులను నిర్వర్తించే కార్యదర్శులను ప్రభుత్వం గ్రేడ్- 5 పేరిట సచివాలయ వ్యవస్థలోకి తీసుకువచ్చి వారికి పంచాయతీ విధులు కాకుండా సచివాలయ విధులు కేటాయించింది. ఇది పంచాయతీరాజ్ చట్టం-1994, జీవో 149కు పూర్తిగా విరుద్ధం. ఇలా పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ యేతర విధులకు వినియోగించడమే అసలు సమస్యకు మూలం. రాష్ట్రంలో ప్రస్తుతం 13,324 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2019కి ముందు వాటిలోని 7 వేల గ్రామ పంచాయతీలకు మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. దీంతో రెండు, మూడు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక్కో క్లస్టర్‌కు ఒక పంచాయతీ కార్యదర్శిని ఇన్ చార్జిగా నియమించారు. క్లస్టర్ పరిధిలోని పంచాయతీల్లో గ్రేడ్-5 కార్యదర్శులకు బాధ్యతలు కేటాయించారు. దీంతో వారంతా అప్పటికే ఉన్న గ్రేడ్-1, 2, 3, 4 కార్య దర్శుల కింద పనిచేయాల్సి వచ్చింది. దీంతో పంచాయతీ రికార్డులు, మినిట్స్ బుక్స్ నిర్వహించే సాధారణ అధికారాలు కూడా వారికి దక్కలేదు. సచివాలయ విధుల పేరుతో విధివిధానాలు లేని అనేక పనులు కేటాయించి వారిని వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ సచివాలయాల్లో 568 గ్రేడ్ 5 కార్యదర్శులు ఉన్నారు. వీరంతా అప్పటికే ఉన్న సీనియర్ కార్యదర్శుల కింద పనిచేస్తున్నారు. సచివాలయాల్లోని ఇతర శాఖల మాదిరిగా ఆయా శాఖల విధులు మాత్రమే నిర్వహించడం కాకుండా సచివాలయ విధుల పేరుతో అనేక పనులు చేయాల్సి వస్తోంది. జగనన్న కాలనీల నిర్మాణం, ఓటీఎస్, ఆడుదాం ఆంధ్ర రిజర్వేషన్ సహా ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా తొలి బాధితులు గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులే అన్నట్లుగా తయారైంది. దీనికి తోడు అప్పటికే ఉన్న సీనియర్ కార్యదర్శుల ఒత్తిడి భరించలేనిదిగా ఉంటోంది. జీవో వచ్చి రెండేళ్లు అవుతున్నా విధులు కేటాయించకపోవడంతో చెప్పలేని భారం పడుతోందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు.

ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి మాటేమిటో?

దాదాపు నాలుగున్నరేళ్ల క్రితం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగినా 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' అన్న నియమానికి మోక్షం మాత్రం దక్కలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల సంఖ్యతో సమానంగా కార్యదర్శులు ఉన్నా అది ఆచరణకు నోచుకోలేదు. ఉద్యోగుల ఆందోళన చేసినప్పుడల్లా తూతూమంత్రపు చర్యలు తీసుకోవడమే తప్ప ఫలితం లేదు. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై కిందటేడాది సెప్టెంబరులోనే ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ ఈ రోజు వరకూ అది ఆచరణకు నోచుకోలేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేసినా అది ఆచరణకు ఎందుకు నోచుకోలేదో తెలియక ఉద్యోగులు అయోమయంలో పడిపోయారు. ముఖ్యమంత్రికి తెలియకుండా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులే దాన్ని తొక్కిపెట్టారని ఆలోచిస్తున్నారు. ఇది ప్రభుత్వం ఆడుతున్న 'జగన్నాటకమ'ని గ్రహించలేక ముఖ్యమంత్రికి తెలిసి ఉండదని అమాయకంగా నమ్ముతున్నారు. రేపు ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటో తెలియని అయోమయస్థితిలో తాడోపేడో తేల్చుకునేందుకు ఆందోళనా బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

చెత్త దుర్వాసన



- పట్టణాలు దుర్గంధభరితం
- గృహాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- కార్మికుల సమ్మెతో ప్రమాదంలో ప్రజారోగ్యం
- ఎనిమిదో రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల సమ్మె
- నేటి నుంచి మరింత ఉధృతంగా మున్సిపాల్టీలో ఆందోళనలు

చెత్త చెదారాలు.. కాల్వలు నిండా మురుగు.. పొంగి రోడ్లపైకి వస్తోన్న మురికినీరు.. అపరిశుభ్రత.. దుర్వాసనలతో పట్టణాలు నిండిపోయాయి. చెత్త కుళ్లి దుర్వాసనను వెదజల్లుతుంది. చెత్త ఎత్తేవారు లేరు.. కాల్వలు తీసేవారు కనుమరుగు.. ఇళ్లలో చెత్త సేకరించే వారు రావడంలేదు.. కార్మికుల సమ్మెతో పట్టణాలు కంపోస్టుయార్డులుగా మారాయి. సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మెతో మున్సిపల్ పట్టణాల్లో పారిశుధ్య సేవలు స్తంభించాయి. ఇంటింటా చెత్త సేకరణ లేకపోవడంతో ఇళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలతో దుర్వాసన. కాల్వలు తీయకపోవడంతో మురుగు పొంగి ప్రవహిస్తోంది. పారిశుధ్య కార్మికుల సమ్మె మంగళవారంతో ఎనిమిదో రోజుకు చేరినా ప్రభుత్వం నుంచి బెదిరింపులు వస్తున్నాయే కాని వారి డిమాండ్ల పరిష్కారంపై ఆలోచించడంలేదు. మరోవైపు బుధవారం నుంచి మిగిలిన కార్మికులు కూడా నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. ఇప్పటికే చెత్త చెదారాలతో నిండిపోయిన రోడ్లు.. ఇళ్లలోని వ్యర్థాలతో దుర్వాసన, దోమలతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది. ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు ప్రైవేటు కార్మికులతో చెత్త ఎత్తే పనులను చేపట్టే ప్రయత్నాలను సమ్మెలోని కార్మికులు అడ్డుకుంటున్నారు. దీంతో తెనాలి, నరసరావుపేట తదితర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల సహకారంతో బెదిరిస్తున్నా కార్మికులు వెనక్కి తగ్గడంలేదు.

నరసరావుపేట, జనవరి 2: రహదారుల్లో చెత్త పేరుకు పోయింది. మురుగు కాల్వలు పూడిక తీతకు నోచుకోవడంలేదు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కార్మికుల సమ్మెతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడనున్నది. రోజురోజుకు అపరిశుభ్రత తీవ్రమవుతుండటంతో రోగాల బారిన పడతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాల్టీల్లోని రహదారులు కంపోస్టు యార్డులుగా మారిపోయాయి. ఎక్కడికక్కడ చెత్త చెదారాలు పేరుకుపోయాయి. డంపర్‌బిన్లు నిండిపోయాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నా కార్మికులు అడ్డుకుంటున్నారు. పారిశుధ్య కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. పురపాలక సంఘ కార్యాలయాల వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం దిగిరాకుంటే అత్యవసర సేవలను నిలిపివేస్తామని కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను మోసగించారని కార్మిక సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. హామీలను అమలు చేయాలని గతంలో కూడా సమ్మె చేయగా అప్పుడు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా కార్మికులను దారుణంగా ప్రభుత్వం మోసగించిందని కార్మికులు మండిపడుతున్నారు. డిమాండ్లు సాధించే వరకు సమ్మె వీడేది లేదని తేల్చి చెబుతున్నారు.

నేటి నుంచి సంపూర్ణంగా సమ్మె..

ఇప్పటికే కొంతమంది కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. బుధవారం నుంచి మిగిలిన కార్మికులు కూడా సమ్మెలోకి వెళ్లనున్నారు. ఇప్పటికే వారు మున్సిపల్ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీంతో మున్సిపల్ కార్మికుల సమ్మె మరింత ఉధృతం కానున్నది. ఇప్పటి వరకు సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల కార్మికులు సమ్మెలో పాల్గొంటుండగా బుధవారం నుంచి ఏఐటీయూసీ అనుబంధ సంఘ కార్మికుల కూడా సమ్మెలో పాల్గొననున్నారు. దీంతో మున్సిపాల్టీలో సంపూర్ణంగా సమ్మె జరగనున్నది. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, దాచేపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, గురజాల మునిసిపాల్టీలలో సమ్మె జరుగుతోంది. బాపట్ల జిల్లాలోని చీరాల, బాపట్ల, అద్దంకి, గుంటూరు జిల్లాలోని తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు కార్పొరేషన్‌లో నిరవధిక సమ్మె ఉధృతంగా కొనసాగుతుంది.



నరసరావుపేటలో కార్మికులు పోలీసుల మధ్య తోపులాట



కార్మిక సంఘ నేతలకు వార్నింగ్ ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యేతో వాగ్వాదం.. అరెస్టు

- పారిశుధ్య పనులను అడ్డుకున్న కార్మికులు
- నరసరావుపేటలో పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట

నరసరావుపేట: పారిశుధ్య కార్మికులు సమ్మె సందర్భంగా నరసరావుపేటలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ప్రైవేట్ కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టడాన్ని సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. పార్టీ శ్రేణులతో కలసి పారిశుధ్య పనుల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొనగా కార్మి కులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డికి కార్మికుల మధ్య వాగ్వావాదం చోటుచేసు కుంది. పారిశుధ్య పనులను అడ్డుకుని వారిపై చెత్త పోసి కార్మికులు నిరసన తెలిపారు. దీంతో పోలీసులు కార్మికులను అదుపులోకి తీసుకునే క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. అనంతరం వారిని ఒకటో పట్టణ పోలీ సుస్టేషన్‌కు తరలించగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట మిగిలిన కార్మికులు ధర్నా చేశారు. చంద్రబాబుకు కార్మికులు అమ్ముడుపోయారని ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం రూ.22 వేలకు జీతాలు పెంచినా సమ్మె చే యడం సరైనదేనా అని కార్మికులను ఎమ్మెల్యే నిలదీశారు. అబద్ధాలు ఆడొద్దని కార్మిక సంఘం నాయకురాలు శివకుమారి అన్నారు. రౌడీలను తీసుకొచ్చి ఎమ్మెల్యే దాడులు చేయించారని ఆమె విమర్శించారు. మీరు అమ్ముడుపోయినట్లు కార్మిక నాయకులు అమ్ముడు పోతారనుకుంటే ఎలా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. తొలుత మున్సిపల్ బంగళా వద్ద చెత్త తరలింపు లారీలను కార్మి కులు అడ్డుకున్నారు. గుంటూరురోడ్డులో క్లాప్ ఆటోలను విని యోగించే ప్రయత్నాలను కార్మికులు నిరోధించారు. కార్మికుల అరె స్టు, ఎమ్మెల్యే వైఖరిపై నిరసనకు దిగిన కార్మికులు పలు ప్రాం తాల్లోని డంపర్‌బిన్లలోని చెత్తను రోడ్లపై కుమ్మరించారు. డి మాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కాళ్లు విరగ్గొడతా.. లోపలేయిస్తా

- సమ్మె ముగిశాక ఉద్యోగం ఎలా చేస్తారో చూస్తా
- పారిశుధ్య కార్మికులకు తెనాలి హెల్త్ ఆఫీసర్ బెదిరింపు

తెనాలి (ఆంధ్రజ్యోతి): 'ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటా.. సమ్మె ముగిశాక ఉద్యోగం ఎలా చేస్తారో చూస్తా. అడుగు ముందుకు వేస్తే కాళ్లు విరగ్గొడతా.. పోలీస్ కేసులు పెట్టించి లోపలేయిస్తా..' అంటూ సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేలుచూపించి మంగళవారం తెనాలి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నిర్మల హెచ్చరించారు. దీంతో కార్మికులు ఒక దశలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు కార్మికులను సమ్మెలోని పారిశుధ్య కార్మికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ట్రాక్టర్‌లకు అడ్డుగా పడుకుని కదలనివ్వలేదు. మున్సిపల్ అధికారులు పోలీసుల సహ కారంతో కార్మికులను పక్కకు లాగేసి ట్రాక్టర్లను ముందుకు తీసుకువెళుతుండగా వారు ఆందోళనకు దిగారు. ఈ తరుణంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ నిర్మల వారిపై తీవ్ర స్థాయిలో బెదరిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్నాము.. మీరూ సమ్మెలు చేశారు.. అప్పుడు న్యాయమైనప్పుడు మేము ఆందోళన చేస్తుంటే అడ్డుకోవటం సబబేనా అని మహిళా కార్మికులు ఆమెను ప్రాధేయపడ్డారు. ఇన్ని రోజులు ప్రైవేటు కార్మికులతో పారిశుధ్య పనులు చేయించుకున్నా మాట్లాడలేదని, రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అడ్డుకుంటున్నామని, సహకరించాలని కోరారు. అయితే ఆమె అందుకు అంగీక రించకపోగా మరింతగా మండిపడ్డారు. పోలీసులతో వారిని పక్కకు నెట్టేయించి వీరిలో ఒక్కరికి కూడా మచ్చర వేయొద్దని, తనకు చెప్పకుండా ఎవరినీ విధుల్లోకి తీసుకోవద్దంటూ ఆమె ఆదేశాలు ఇచ్చారు. దీంతో కార్మికులు ఆమెపై మరింతగా అసహనం వ్యక్తం చేస్తూ వాదనకు దిగి సమ్మె హక్కును కాలరాస్తారా అంటూ రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. మహిళా పోలీసులు పారిశుధ్య కార్మికులను అడ్డుకోవడం, పెనుగులాట వంటి వాటితో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



తెనాలిలో పారిశుధ్య కార్మికులను బెదిరిస్తున్న హెల్త్ ఆఫీసర్ నిర్మల



పొన్నూరు: ఎన్జీ రంగా విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు



బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సాగర పరిక్రమతో అభివృద్ధి

- నిజాంపట్నం హార్బర్‌లో రూ.455 కోట్లతో పనులు
- కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల

రేపల్లె, జనవరి 2: సాగర పరిక్రమతో సముద్రతీర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, మత్స్యకారుల జీవితాలు మారుతాయని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించిన కేంద్రమంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగర పరిక్రమ ద్వారా 146.15 లక్షల మంది కి లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో నాలుగు ఆక్వా పార్కులు మంజూరు కాగా వాటిలో నిజాంపట్నం ఒకటని రూ.455 కోట్లతో హార్బర్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. చెన్నై నుంచి మినీ బోట్లలో జలమార్గం గుండా ప్రయాణించి మత్స్యకారుల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులను తెలుసుకుంటున్నామన్నారు. పేద మత్స్యకారులకు కేసీసీ కార్డులు, రూ.లక్ష చొప్పున సబ్సిడీ రుణాలు అందిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సముద్ర తీర మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలు, రూ.5 లక్షల గృహ రుణ సదుపాయం, నివేశన స్థలాలను మంజూరు చేయాలన్నారు. అనంతరం మత్స్యకారులకు జీపీఎస్ ఎకోసైండర్, లైఫ్ జాకెట్లు, సబ్సిడీ రుణాలపై పొందిన వ్యాన్లను అందజేశారు. తొలుత నిజాంపట్నం హార్బర్ రోడ్డులో రొయ్యపిల్లలను పరిశీలించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎంపీ నందిగం సురేష్, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, మత్స్యశాఖ సహాయ కమిషనర్ రీతూప్రసాద్, మత్స్యశాఖ జేడీ సురేష్, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జున్‌రావు, వైసీపీ రేపల్లె ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్, ఆర్డీవో హేలా షోరాన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జీ.చంద్రమౌళి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల

మళ్లీ.. వేసేశారు!

విద్యుత్ అరియర్స్ పేరుతో బాదుడు

ప్రతి ఇంటికీ రూ.500 నుంచి రూ.1000 వరకూ వడ్డింపు

కొండపి, జనవరి 2 : ప్రభుత్వం కొత్త సంవత్సరంలో పేదలకు షాక్ ఇచ్చింది. మరోసారి విద్యుత్ బిల్లుల భారం మోపింది. అరియర్స్ పేరుతో ఒక్కో గృహానికి రూ.500 నుంచి రూ.1000 వరకూ వడ్డించింది. ఏమి అరియర్సో అర్థంకాక వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో పెండింగ్ ఏమీ లేకపోయినా.. అదనపు లోడ్ పేరుతో వేసిన బిల్లులు చెల్లించినప్పటికీ జనవరి బిల్లులో అరియర్స్ అంటూ అదనంగా చార్జీలు వేయడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.



అరియర్స్ పేరుతో రూ.480 అదనంగా వేసి పంపిన విద్యుత్ బిల్లు

పెరిగింది..పంపిణీ ఆగింది

జిల్లాలో పింఛన్ల పంపిణీ ఆలస్యం

పెంపు మహోత్సవాల పేరుతో ఆర్భాటం

ఈ నెల 8వరకు నిర్వహించాలని ఆదేశం

ఎమ్మెల్యేలకు సమయం కుదిరితేనే పంపిణీ

గ్రామాల్లో పింఛన్ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

జిల్లాకు రావాల్సింది రూ.88.98 కోట్లు..

వచ్చింది రూ.46.26 కోట్లే

ఒంగోలు నగరం, జనవరి 2: ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటికే వచ్చి అందించే పింఛన్ సొమ్ము ఈ నెలలో చేతికందేందుకు వారం రోజులపైనే పట్టనుంది. ఈ నెల నుంచి ఫించన్‌ను రూ.3 వేలు చేసిన రాష్ట్రప్రభుత్వం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పింఛన్ పెంపు మహోత్సవాలు నిర్వహించి వాటికి ఎమ్మెలను ఆహ్వానించి వారి ద్వారా ఇప్పించాలని ఆదేశించింది. ఇందుకోసం ప్రతి మండలానికి పంపిణీ చేసే తేదీని ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. జనవరి ఒకటో తేదీన కనిగిరి, ఒంగోలు నియోజకవర్గాల్లో పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు ప్రకటించారు. 2న హెచ్ఎంపాడు, కనిగిరి, వీసీపల్లి, మార్కాపురం, ఒంగోలులో పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. 3న దొనకొండ, ముండ్లమూరు, గిద్దలూరు, పామూరు, వెలిగండ్ల, మర్రిపూడి, చీమకుర్తి, ఎన్‌జీపాడు, ఎస్ఎన్‌పాడు, దోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం, వైపాలెం, 4న కురిచేడు, కంభం, జరుగుమల్లి, శింగరాయకొండ, పొదిలి, 5న దర్శి, బీపేట, కొమరోలు, కొండపి, పొన్నలూరు, టంగుటూరు, కొనకనమిట్ల, 6న తాళ్లూరు, అ ర్థవీడు, ఒంగోలు అర్బన్, గిద్దలూరు, 8న గిద్దలూరు, రాచర్ల, మద్దిపాడు మండలాల్లో పింఛన్ల పంపిణీ ఉంటుందని ప్రకటిచారు. అయితే జిల్లాలో ఎక్కడా స్థానిక ఎమ్మెల్యేలు పింఛన్ పెంపు మహోత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తిచూపించటం లేదు. జనవరి 1,2 తేదీల్లో ప్రకటించిన మండలాల్లో కూడా ఎమ్మెల్యేలు హాజరు కాకుండానే స్థానిక ప్రజాప్రతినిధులతో వైఎస్సార్‌కేపీ ఉద్యోగులు మహోత్సవాలు నిర్వహించి పంపిణీ ప్రారంభించారు. అయితే పంపిణీ ప్రారంభమైన తర్వాత కొద్ది మందికే ఇస్తున్నారు. ఆ మండలంలోని లబ్ధిదారులందరికీ పూర్తిస్థాయిలో ఇవ్వటం లేదు. ఇక మిగిలిన మండలాల్లో కూడా ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారమే పింఛన్ పెంపు మహోత్సవాలు నిర్వహించిన తర్వాతే పంపిణీ ప్రారంభించాల్సి ఉంది కాబట్టి ఈ నెల 8వ తేదీ వరకు పంపిణీ జిల్లా మొత్తం మీద ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది.

ప్రతి నెలా ఏ ఒక్కరితో సంబంధం లేకుండా నేరుగా వలంటీర్ల ద్వారా అందించే పింఛన్ సొమ్ముకు ఈ నెలలో ప్రభుత్వం ఎమ్మెల్యేలతో లింకు పెట్టింది. పెంపు మహోత్సవాలంటూ హడావుడి చేయాలని, వాటికి ఎమ్మెల్యేలను పిలవాలని ఆదేశించింది. అయితే జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరూ ఎన్నికలవైపు దృష్టి పెట్టి ఉన్నారు. తమకు టికెట్ దక్కుతుందో లేదో అనే మీమాంసలో ఉన్నారు. ప్రభుత్వమేమో స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు డీఆర్‌డీఏ, వైఎస్సార్ కేపీ అధికారులు తేదీలను కూడా ఖరారు చేసి ప్రకటించారు. దీంతో ఈ నెలలో పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు అందటం ఆలస్యమయ్యే పరిస్థితి అనివార్యమైంది.

అవసరమైన నిధులు రూ.88.98 కోట్లు

జిల్లాలో మొత్తం సామాజిక పింఛన్లు 2,97,415 ఉన్నాయి. వీటికి నెలవారీగా రూ.88.98 కోట్లు అవసరం. జిల్లాలో 2,97,415 పింఛన్లు ఉండగా ఇందులో వృద్ధాప్య, వితంతు, చేనేత, ఒంటరి మహిళల, కల్లుగీత కార్మికుల పింఛన్లు 2,47,638 ఉన్నాయి. వీటిని మాత్రమే ఇప్పటివరకు రూ.2,750 ఇస్తున్నారు. వీటిని ప్రభుత్వం ఇప్పుడు రూ.3 వేలకు పెంచేసింది. ఇవిపోను హెచ్ఐవీ బాధితులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.3వేలకుపైనే ప్రభుత్వం పింఛన్ ఇస్తూ వస్తోంది. రూ.3 వేలకు తక్కువగా ఉన్న పింఛన్లనే ప్రభుత్వం రూ.3వేలు చేసి ఈ నెల నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించింది.



పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

జిల్లాకు కొత్తగా 3,731 పింఛన్లు మంజూరు

జిల్లాలో గతనెల వరకు 2,93,684 సామాజిక పింఛన్లు ఉన్నాయి. ఈ నెలలో కొత్తగా 3,731 మంజూరు చేసింది. కొత్త పింఛన్లతో కలుపుకొని జిల్లాలో మొత్తం పింఛన్లు 2,97,415కి చేరాయి. కొత్తగా మంజూరైన పింఛన్లకు కూడా రూ.3వేల వంతున ఈ నెల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అ య్యాయి.

విడుదలైంది రూ.46.26 కోట్లు

ప్రభుత్వం ఆర్భాటంగా ఈ నెల నుంచి పింఛన్లను రూ. 3వేలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ప్రతినెలా ఒకటో తేదీనే వీటిని వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోంది. పెంచిన మేరకు రూ.3వేలు ఈ నెలలోనే పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం అందుకు తగ్గట్లుగా అవసరమైన మేరకు నిధులను విడుదల చేయలేదు. నిధులు లేకనే పెంపు మహోత్సవాల పేరుతో పింఛన్ల పంపిణీని ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో శాసనసభ్యులు ఈ మహోత్సవాల్లో పాల్గొని పింఛన్లు పెంచామని చెప్పుకునేందుకు పెద్దగా ఆసక్తి కూడా చూపటం లేదు. అయితే నిధులు లేక మహోత్సవాల పేరుతో పంపిణీని ఈ నెల 8వతేదీ వరకు పంపిణీ చేయనున్నామని ప్రకటించింది. ఇప్పటివరకు పింఛన్ల పంపిణీనికి అవసరమైన నిధుల్లో సగం నిధులు మాత్రమే జిల్లాకు విడుదలయ్యాయి.

కొన్నిశాఖల ఉద్యోగులకే జీతాలు

40 శాతం మందికి ఇంకా పడలేదు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 2 : ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల సమస్య ఇంకా కొలిక్కిరాలేదు. నూతన సంవత్సరంలోనైనా తొలిరోజే జీతాలు పడతాయని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. గతంలో మాదిరిగానే ఎప్పుడు పడతాయోనని ఎదురు చూడాల్సి వస్తోంది. కేవలం కొన్నిశాఖల వారికే మాత్రమే జీతాలు పడగా మెజార్టీ ఉద్యోగులు ఉన్న శాఖలకు మాత్రం జీతాలు పడని పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త సంవత్సరంలోనైనా 1వ తేదీనే ఉద్యోగులు, పెన్షనర్లు తమ బ్యాంకు అకౌంట్లలో జీతాలు, పెన్షన్లు జమవుతాయని ఆశించారు. జగన్ సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటంతో ఉద్యోగులు మండిపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు మరో 20 వేలమంది వరకు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. ఇలా అన్నిశాఖల్లో 50వేల మందికిపైగానే ఉన్నారు. ఇప్పటివరకు సచివాలయ ఉద్యోగులు, ట్రెజరీ, పోలీస్‌తోపాటు మరో నాలుగైదు శాఖలకు మాత్రమే జీతాలు పడ్డాయి. ప్రధానంగా ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులే 30వేల మంది వరకు ఉంటారు. గత నెలలో రిటైర్డ్ ఉద్యోగులకు నాలుగైదు తేదీల్లో పెన్షన్లు పడ్డాయి. ఇక ఉపాధ్యాయులకు ఏ తేదీన పడుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇలా ప్రభుత్వ ఉద్యోగులు తమ జీతాల కోసం తొలి సంవత్సరంలోనూ ఎదురు చూడాల్సిన రావడంతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు మండిపడుతున్నారు.

వైసీపీకి షాక్

శివరాయునిపేటలో కీలక నేతలు టీడీపీలో చేరిక

సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే స్వామి



ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీలో చేరిన శివరాయునిపేట వైసీపీ ముఖ్యనాయకులు

మర్రిపూడి, జనవరి 2 : మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. శివరాయునిపేటలో ఆపార్టీకి చెందిన కీలకనేతలతోపాటు 30 కుటుంబాలవారు మంగళవారం ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. కాకర్ల పంచాయతీ పరిధిలోని శివరాయునిపేటలో రెండు ప్రధాన సామాజికవర్గాలకు చెందిన వైసీపీ ముఖ్యనాయకులను పార్టీలో చేర్చుకునేందుకు గతకొన్ని రోజులుగా టీడీపీ ముఖ్యనేతలు సమాలోచనలు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా యాదవ సామాజికవర్గంలో కీలక నేతగా గుర్తింపు పొందిన జేసీఎస్ కన్వీనర్ కలగట్ల కాశయ్య, ఎస్సీ కాలనీకి చెందిన మోయిడి భాస్కర్‌రావుల ఆధ్వర్యంలో 30 కుటుంబాలకుపైగా స్థానిక శాసనసభ్యులు బాలవీరాంజనేయలు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయి టీడీపీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. మరికొద్ది రోజుల్లో కొన్ని కీలక గ్రామాల్లో పార్టీలో చేరికల ఉంటాయని తెలిసింది. మొత్తం మీద వైసీపీకి అడ్డాగా ఉన్న శివరాయునిపేటలో రెండు ప్రధాన సామాజికవర్గాలకు చెందిన నాయకులు టీడీపీలో చేరడంతో తెలుగు తమ్ముళ్లు జోష్‌లో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, నాయకులు వేమిరెడ్డి రమణారెడ్డి, రామిరెడ్డి, చెరుకూరి బ్రహ్మయ్య, గంగిశెట్టి శ్రీనివాసరావ్, తరిమెళ్ల ప్రేమానందం, గురిజాల ఏసుపాదం, బోయపాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పదవికి జగన్ అనర్హుడు

అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తప్పుడు కేసులతో వేధింపులు

మాజీ మంత్రి పుల్లారావు

దర్శి, జనవరి 2 : సీఎం పదవికి జగన్ అనర్హుడని, గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మం త్రి పత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పుచేయని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి నిర్బంధించడం దారుణమన్నారు. ఈ సంఘటనతో ప్రజలు వైసీపీ పాలకులను అసహ్యించుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబుకు ప్రపంచ దేశాల్లో సైతం ఏ నాయకుడికీ లేని గుర్తింపు, సానుభూతి లభించిందన్నారు. వైసీపీ పార్టీలో సీట్ల కుమ్ములాట మొదలైందని, ఓటమి భయంతో ఏం చేయాలో పాలుపోక జగన్ సతమతమవుతున్నారని అన్నారు. కుటుంబ సభ్యులూ జగన్ తీరును తప్పుపడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా టీడీపీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతందని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని ఆడపడుచులకు భద్రత కరువైందని పుల్లారావు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎ మ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్ నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

దున్నపోతులకు వినతిపత్రాలు

22వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

అన్ని కేంద్రాల్లో జరిగిన ఆందోళన

ఒంగోలు నగరం, జనవరి 2 : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరింది. వివిధ రూపాల్లో, వినూత్న పద్ధతిలో తమ ఆందోళనను కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు మంగళవారం దున్నపోతులకు వినతిపత్రాలను ఇచ్చి తమ నిరసనను తెలియజేశారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో అంగన్‌వాడీలు ఆయా ప్రాంతాల్లో రిలేదీక్షలు నిర్వహిస్తూనే ఎక్కడికక్కడ దున్నపోతుకు అర్జీలు సమర్పించారు. గత 22 రోజులుగా తాము చేస్తున్న ఆందోళనను పట్టించుకోకుండా రాష్ట్రప్రభుత్వం దున్నపోతులా వ్యవహరిస్తుందంటూ వినతిపత్రాలు సమర్పించారు. ఇకనైనా నిద్రలేచి తమతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఒంగోలులో కలెక్టరేట్ వద్ద దీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో అంగన్‌వాడీల యూనియన్ నాయకులు కేవీ సుబ్బమ్మ, ప్రశాంతి తదితరులు, సీఐటీయూ నాయకులు దామా శ్రీనివాసులు, జీవీకొండారెడ్డి, నారాయణరెడ్డి, మహేష్ తదితరులు మద్దతు ప్రకటించారు. యూనియన్ నాయకులు జ్యోతి, ప్రశాంతి, హేమోమా తదితరులు పాల్గొని దున్నపోతుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని కోరుతూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దర్శి, కనిగిరి, మార్కాపురం, పొదిలి తదితర ప్రాంతాల్లో కార్యకర్తలు, ఆయాలు ఆందోళన నిర్వహించి అనంతరం దున్నపోతులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆందోళనలు ఉద్దేశించి అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఇంతకాలం ప్రభుత్వం గౌరవ వేతనం పేరుతో తమను నానా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. గౌరవవేతనం కాదు కనీస వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా నెలకు రూ.25 వేలు వేతనం చెల్లించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. వైసీపీ మంత్రులు, కొంతమంది ఎమ్మెల్యేలు ఉద్యమాన్ని చులకన చేసి మాట్లాడటం శోచనీయన్నారు. ఉద్యమాన్ని పట్టించుకోకపోతే తమ సత్తా ఏమిటో రాబోయే ఎన్నికల్లో చూపిస్తామని వారు హెచ్చరించారు.



దర్శిలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలుకు సుధీర్!

» తేల్చిచెప్పిన జగన్ » రెండురోజుల్లో చెప్తాం: శిద్దా » గిద్దలూరుకు బాలినేని?

వైపాలెంలో చంద్రశేఖర్‌కు గ్రీన్‌సిగ్నల్

మార్కాపురం పెండింగ్

జంకెతో సాయిరెడ్డి మంతనాలు

రేపు రమ్మని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి కబురు

మాగుంట విషయంలో బాలినేని సందిగ్ధం

అధికార వైసీపీ అభ్యర్థుల ఎంపికల్లో మరో ముందడుగు వేసింది. ఒంగోలు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడు సుధీర్‌ను రంగంలోకి దింపబోతున్నారు. వైపాలెం నుంచి చంద్రశేఖర్‌నే నిర్ణయించారు. గిద్దలూరు నుంచి బాలినేనిని రంగంలోకి దింపబోతున్నారు. అయితే ఎంపీ స్థానానికి మాగుంటకు అవకాశం ఇస్తారా లేదా? అన్న సందిగ్ధంలో బాలినేని ఉన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గురువారం వచ్చి కలవాలని సీఎంవో నుంచి సమాచారం ఇచ్చారు. దర్శి నుంచి బూచేపల్లి, కనిగిరికి బుర్రా పేర్లు కూడా దాదాపుగా ఖరారయ్యాయి. అయితే మంగళవారం సీఎం జగన్ బాలినేనిని కానీ మాగుంట కానీ లేకుండానే శిద్దాతో, చంద్రశేఖర్‌తో అలాగే సాయిరెడ్డి జంకెతో చర్చలు జరపటం చర్చనీయాంశాలయ్యాయి.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలోని ఆయా స్థానాల అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై గతంలో చెప్పినట్లే మంగళవారం వైసీపీ అధిష్ఠానం కసరత్తు చేసింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఆయన కుమారుడు సుధీర్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఎర్రగొండపాలెం టిక్కెట్ ఆశిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్‌లను తాడేపల్లి పిలిపించుకున్నారు. వీరి లో శిద్దా, ఆయన కుమారుడు సుధీర్‌తో అలాగే చంద్రశేఖర్‌తో సీఎం జగన్ భేటీ అయ్యారు. తొలుత శిద్దా ఆ పార్టీ నాయకులు సాయిరెడ్డితో మాట్లాడారు. ఆ తర్వాత వారిద్దరు జగన్‌ను సాయంత్రం మూడున్నర తర్వాత కలిశారు. సీఎం నేరుగా 'ఒంగోలు నుంచి సుధీర్ పోటీ చేయాలి, అతని రాజకీయ భవిష్యత్తు నేను చూసుకుంటా. రానున్న 30ఏళ్లు సుధీర్ నాతో పయనిస్తాడు, మీరు నిశ్చింతగా ఉండండి' అని రాఘవరావుకు చెప్పి సుధీర్ భుజం తట్టినట్లు తెలిసింది. తండ్రీకొడుకులు ఏవో చెప్పబోగా ఇప్పుడు ఇతరత్రా విషయాలు ఏమీ వద్దు, నేను చెప్పిన పనిచేయండి అన్నీ చూసుకుంటానని అన్నట్లు సమాచారం. అయితే వారికి లోక్‌సభ నుంచి మాగుంట పోటీచేస్తారా లేదా బాలినేని ఎక్కడ పోటీచేస్తారు అనే విషయంపై జగన్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. చివరికి శిద్దా రాఘవరావు తమకు కొద్దిగా సమయం ఇవ్వండి ఒంగోలు వెళ్లి అన్నీ మాట్లాడుకుని వచ్చి కలుస్తామని చెప్పినట్లు తెలిసింది. జాప్యం చేయకుండా ముందు పోటీకి సిద్ధపడుతున్నట్లు తనకు సమాచారం ఇవ్వండి, ఎక్కువ రోజులు వేచిచూసేది లేదని జగన్ తేల్చిచెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత తండ్రీకొడుకులు నేరుగా కారెక్కి ఒంగోలు వచ్చారు. కొంతసేపు ఎవరికీ ఫోన్‌లో కూడా అందుబాటులో లేని వారు ఆ తర్వాత కొంతమంది సన్నిహితులతో సీఎం ఒంగోలులో పోటీ చేయమంటున్నాడు మీతో మాట్లాడాలి ఒకసారి కలుద్దామని చెప్తున్నట్లు తెలిసింది. మంగళవారం రాత్రికే ఇటు కుటుంబసభ్యులు, ఇతరత్రా సన్నిహితులతో వారు మాట్లాడుకున్నట్లు సమాచారం.



జగన్‌కు బొకే ఇస్తున్న రాఘవరావు, సుధీర్

చంద్రశేఖర్‌కు గ్రీన్‌సిగ్నల్

ఆ తర్వాత సీఎం జగన్‌ను తాటిపర్తి చంద్రశేఖర్ కలిశారు. మీరు ఎర్రగొండపాలెం నుంచి పోటీ చేయాలి. వెంటనే వెళ్లి పని ప్రారంభించుకోండి అని చెప్పారు. చంద్రశేఖర్ తన గురించి చెప్పుకోబోగా నాకు అంతా తెలుసు. అన్నీ ఆలోచించే మిమ్మల్ని పంపుతున్నాను నిశ్చింతగా పనిచేసుకోండని చెప్పినట్లు తెలిసింది.

జంకెతో విజయసాయి చర్చలు

మార్కాపురం టికెట్ ఆశిస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితో విజయసాయిరెడ్డి చర్చలు జరిపారు. అయితే ఆయన్ను సీఎంతో కలపలే దు. మార్కాపురం ప్రస్తుత ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని పిలిపిస్తున్నామని ఆయన తో మాట్లాడిన తర్వాత మీకు సమాచారం ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. మార్కాపురం ఎమ్మెల్యే తండ్రి కేపీ కొండారెడ్డి అనారోగ్యంతో వైద్యశాలలో ఉన్నారు. అందువలన నాగార్జునరెడ్డితో మాట్లాడి మిమ్మల్ని మూడు రోజుల్లో పిలిపిస్తామని చెప్పినట్లు సమాచారం. జంకె విషయంలో సానుకూలంగా ఉన్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు. లోక్‌సభ అభ్యర్థి ఎంపికకు అనుగుణంగా మార్కాపురం విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఇంకా ఖరారు కాలేదు

గిద్దలూరు నుంచి బాలినేని

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని పేరును గిద్దలూరుకు పరిశీలిస్తున్నారు. ఆ మేరకు ఆయనకు, ఇతర నాయకులకు కూడా అధిష్ఠానం సంకేతాలిచ్చింది. బాలినేనిని మంగళవారం తాడేపల్లికి పిలవలేదు. ఒంగోలు లోక్‌సభ నుంచి మాగుంటను తప్పించే ఆలోచనలో ఉన్నందున ఆయనకు గతంలో కూడా పిలుపురాలేదు. మంగళవారం అభ్యర్థుల ఎంపిక కసరత్తుకు బాలినేనిని పిలవలేదు. బాలినేని లోక్‌సభ స్థానం నుంచి మాగుంటకే అవకాశం ఇవ్వాలని పట్టుపడుతున్నట్లు తెలిసింది. మిగిలిన అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక తర్వాత బాలినేనిని పిలిచి జగన్ మాట్లాడతారని, ఆయన గిద్దలూరు నుంచి పోటీచేస్తారని అనుచరులు భావిస్తున్నారు. అందిన సమాచారం మేరకు బాలినేని మాత్రం మాగుంటను రంగంలోకి దింపేందుకు పట్టుబట్టి ఆ తర్వాతే తాను అసెంబ్లీకి పోటీచేసేదని తేల్చిచెప్పాలన్న ఉద్దేశంలో ఉన్నట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో 12 స్థానాలు టీడీపీవే

మాజీ ఎమ్మెల్యే దామచర్ల

శంఖారావం సభకు తరలిరావాలని పిలుపు

ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు

కనిగిరి, జనవరి 2 : ప్రకాశం జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడమే టీడీపీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ అన్నారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో చంద్రబాబు ఎన్నికల సమర శంఖారావం తొలి సభ ఏర్పాట్లను మంగళవారం ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఇన్‌చార్జిలు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఏలూరి సాంబశివరావు, దామచర్ల సత్య, నారపశెట్టి పాపారావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, బాలవీరాంజనేయస్వామి, ఎరిక్షన్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, ఐటీఎం కళాశాల చైర్మన్ గోరంట్ల రవీంద్రతో కలసి జనార్దన్ పరిశీలించారు. రాష్ట్రంలో ఎన్నికల సమర శంఖారావం తొలి సభ కనిగిరిలో ఏర్పాటు చేయడం వెనుక జిల్లాపై, కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రపై ఉన్న నమ్మకమే కారణమన్నారు. దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని సభ విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని జనార్దన్ కోరారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే ఆంధ్రరాష్ట్రం కనుమరుగైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల విజయవంతానికి ప్రకాశం జిల్లా పాజిటివ్ ఎనర్జీని ఇస్తుందన్నారు. ఇటీవల ఒంగోలులో మహానాడు, యువగళం నెల్లిమర్ల ముగింపు సభ విజయవంతంలో డాక్టర్ ఉగ్ర చూపిన చొరవ, కృషి బాబు మనసులో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఆ కారణంగా కనిగిరిలో తొలి ఎన్నికల సమర శంఖారావం సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సభకు రెండు లక్షల మందికి పైగా వచ్చే అవకాశం ఉందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధి చెందాలన్నాదే తన సంకల్పమన్నారు. ఎన్నికల శంఖారావం సభలో చంద్రబాబును కనిగిరి ప్రాంతానికి అవసరమైన వాటిని రాబట్టేందుకు మంచి వేదిక ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు, యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. శంఖారావం సభలో చంద్రబాబుకు కనిగిరి ప్రాంతానికి వీటి అవసరం ఉందని తెలియజెప్పాలంటే అశేషంగా ప్రజలు సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు హామీ ఇచ్చారంటే తప్పక నెరవేరుస్తారన్నారు. జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, స్వామి, ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు గోరంట్ల రవీంద్ర, దామచర్ల సత్య తదితరులు శంఖారావం సభను విజయవంతం చేయాలని, కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, పువ్వాడి వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి, వేమూరి రామయ్య, బొమ్మనబోయిన వెంగయ్య, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, బేరి పుల్లారెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామచర్ల, పక్కన స్వామి, ఏలూరి, ఉగ్ర, పాపారావు, సత్య, బాలాజీ

మత్స్యకారుల జీవనోపాధుల మెరుగుకు ప్రత్యేక చర్యలు

» కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురోషోత్తమ్ రూపాల



కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే బలరాం తదితరులతో తమ జీవనస్థితిని వివరిస్తున్న మత్స్యకార మహిళ

చీరాల, జనవరి 2: మత్స్యకారుల జీవనోపాధుల మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పుర్షోత్తమ్ రూపాల అన్నారు. వాడరేవులో మంగళవారం సాగర్ పరిక్రమ ఫేజ్ 10 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. రైతులకు మాదిరిగా కేసీసీ ద్వారా రుణపరపతి మత్స్యకారులకు అందేవిధంగా తీసుకున్న నిర్ణయం వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తోందని చెప్పారు. డీజిల్ రాయితీ, బోట్లు, వలలు కొనుగోలుకు రాయితీ పెంపు తదితర అంశాలకు సంబంధించి మత్స్యకార ప్రతినిధులు ఎరిపిల్లి రమణ, దోనె శ్రీనులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలపై సానుకూలంగా స్పందిస్తామన్నారు. వాడరేవులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణంకు సంబంధించి టెండరు ప్రక్రియ కూడా పూర్తయిందని చెప్పారు. మత్స్యకారులు తమ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కానికి పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు. తమిళనాడు ప్రాంతం నుంచి అనధికారికంగా వచ్చే మత్స్యకారుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి పుర్షోత్తమ్ రూపాల చెప్పారు.

అంతకుముందు స్థానిక మత్స్యకార మహిళ నాయుడు దుర్గ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూత పథకాలను, ఫిష్ ఆంధ్ర దుకాణాలతో అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ముందుగా మత్స్యకార ప్రతినిధులు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రూపాలాకు అందించారు. అనంతరం ఆక్వా కల్చర్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అందులో ప్రధానంగా విద్యుత్ సబ్సిడీని ప్రస్తావించారు. నేను రైతు కుటుంబం నుంచి వచ్చానని సమస్యలన్నీ తెలుసునని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

మంత్రి పుర్షోత్తమ్ రూపాల ఈనెల 22న అయోధ్యలో జరిగే రామమందిర కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే బలరాం, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణలకు ఆహ్వానపత్రాలు అందజేశారు. ఈ ఆహ్వానాన్ని అందరి తరఫున ఇస్తున్నామన్నారు. అందరూ అయోధ్య రాలేకపోయినా ఆరోజు ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో పూజలు నిర్వహించి దీపం వెలిగించి కొత్త దీపావళిగా సంబరాలు జరుపుకోవాలన్నారు. అనంతరం తీరంలో వలల బరువు, బోట్లు, రెస్క్యూటీం నిర్వహించే విధులు తీరంలో ప్రయాణానికి ఉపయోగించే బైక్ తదితరాలకు సంబంధించి ఎమ్మెల్యే బలరాం కేంద్రమంత్రి పుర్షోత్తమ్ రూపాలకు వివరించారు.

అంతకుముందు కలెక్టర్ రంజిత్‌బాషా మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి మత్స్యకారుల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. 150 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.48 లక్షల రుణాలు అందజేశారు. రాష్ట్రంలోని తీరప్రాంతాల్లో హార్బర్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జేసీ సీహెచ్ శ్రీధర్, జాతీయ మత్స్య పరిశ్రమ అభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ కేఎల్ మూర్తి, ఆర్డీవో సరోజిని, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

చీరాల, జనవరి 2: సమాన పనికి, సమాన వేతనం, తదితర తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో కూర్చున్న పారిశుధ్య కార్మికులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. సీఎం జగన్ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసం చేస్తున్నారని మండి పడ్డారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. దీక్షలో కూర్చున్నవారికి సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్.బాబూరావు, తదితరులు మద్దతు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అద్దంకిటౌన్, జనవరి 2: మున్సిపల్ కార్మికులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలని కేంద్ర మాజీమంతి జేడీ శీలం అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తూ పట్టణంలోని షాపుల వెంబడి భిక్షాటన చేసి నిరసన తెలియజేశారు. అద్దంకి వచ్చిన జేడీ శీలం ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతి రెడ్డి, బీఎస్పీ నాయకుడు జోసఫ్ తదితరులు సంఘీభావం తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

» కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం

అద్దంకిటౌన్, జనవరి 2: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. కాంగ్రెస్‌లోకి అందరూ రావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి వివిధ పార్టీలలోకి వెళ్ళిన దళిత, క్రైస్తవ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలవారిని పార్టీలోకి తీసుకువచ్చే విధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఒక కమిటీగా కలిసి యాత్ర నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ మీద చాలా కోసంగా ఉన్నారని చెప్పారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి వాటితో పాటు రాష్ట విభజన చట్టంలోని అనేక అంశాల విషయంలో మోసం చేశారన్నారు. రాష్ట్రంలో, దేశంలో నియంతృత్వ పాలన సాగుతుందన్నారు. షర్మిల పార్టీలో చేరికపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని స్వాగతిస్తామన్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఐదు మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులను ఏర్పాటుచేసి, గ్రామ కమిటీలను వచ్చే నెలనుంచి ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు.

సమావేశంలో మౌర్య శీలం, కోరే సురేంద్రనాథ్, పివ సురేష్‌బాబు, కబల సుబ్రహ్మణ్యం, యర్రమోతు నాగయ్య, నల్లగోర్ల శ్రీనివాసరావు, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, సోమేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలు

మార్టూరు, జనవరి 2: జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌ను ఢీకొని ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలయ్యాయి. ఈసంఘటన సోమవారం అర్ధరాత్రి ఇసుక దర్శి పాండురంగస్వామి ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన సూరిబాబు తన ఆటోలో బాడుగ సామాన్లు తీసుకుని ఒంగోలు వెళ్లారు అక్కడ సామాన్లు దించి తిరిగి ఖాళీ ఆటోతో విజయవాడ వెళుతుండగా, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఆటో డ్రైవర్ సూరిబాబుకు గాయాలుకాగా, 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రెండు గ్రావెల్ టిప్పర్లు పట్టివేత

అద్దంకిటౌన్, జనవరి 2: గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వీటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ సుబ్బారెడ్డి రెండు టిప్పర్లకు రూ.20 వేలు జరిమానా విధించారు.

అధ్వానంగా రహదారులు

» పట్టించుకోని అధికారులు » ప్రజలకు తప్పని అవస్థలు


దైవాలరావూరు - రావినూతల మధ్య పడిన గోతులు

మేదరమెట్ల, జనవరి 2: కొరిశపాడు మండలంలోని ప్రధాన రహదారులు గోతులమయంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మేదరమెట్ల నుంచి రాచపూడి వరకు ఉన్న 18 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారి గోతులతో నిండిపోయింది. రోడ్డు మార్జిన్‌లు కోసుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు ప్రమాదకరంగా తయారయ్యాయి. దైవాలరావూరు - రావినూతల మధ్య పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులతో పాటు కారులు నడిపేవారు ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. దైవాలరావూరు - రావినూతల మధ్య రెండు సింగిల్ లైన్‌పైపు కల్వర్లు ఉన్నాయి. ఏదైన వాహనాలు ఎదురు వస్తే కొత్త వారయితే రోడ్డు మార్జిన్‌లో పడిపోవలిసిందే. ఈ కల్వర్టులకు ఉన్న రక్షణ గోడలు పడిపోయాయి. పోలిమేర వద్ద రోడ్డు మార్జిన్ మొత్తం కోసుకుపోయి పది అడుగులకు పైగా గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలు పడి మొక్కలు మొలవడంతో దగ్గరకు వచ్చే వరకు ఆ గొయ్యి కనిపించదు. రావినూతల- పమిడిపాడు, పమిడిపాడు - రాచపూడి మధ్య కూడా రోడ్డంతా గోతులతో అస్తవ్యస్తంగా తయారయింది. సుమారు 30వేల మంది జనాభాకు ఉపయోగపడే ఈ రోడ్లు గోతులమయం కావడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి కనీస మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తప్పుడు దరఖాస్తులు చేసిన నలుగురిపై కేసు నమోదు

» ఈఆర్‌వో వెంకటనారాయణ


మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకటనారాయణ

పర్చూరు, జనవరి 2: ఫాం7 ద్వారా బతికి ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు తప్పుడు దరఖాస్తు చేసిన మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పర్చూరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి వెంకటనారాయణ తెలిపారు. యద్దనపూడిలో ముగ్గురు వ్యక్తులతోపాటు, పర్చూరులో మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 42,521 దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు. అందులో ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫాం 7 ద్వారా 22,868 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 10,468 అనర్హతగా గుర్తించి తిరస్కరించినట్టు చెప్పారు. ఫాం 7కు సంబంధించి 12 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫాం 8కు సంబంధించి 65 దరఖాస్తులను విచారించాల్సి ఉందన్నారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి డిసెంబర్ 9లోపు వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. తదుపరి వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమన్నారు. విచారణకు 7వారాల గడువు నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటున్నట్టు చెప్పారు. అత్యధికంగా నమోద యిన దరఖాస్తులను త్వరితగతిన విచారణ పూర్తిచేయటంతో ఇటీవల విజయవాడలో జరిగిన ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో అభినందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, కారంచేడు మండలాల తహసీల్దార్‌లు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

51 మందిపై కేసు నమోదు

పర్చూరు నియోజకర్గ పరిధిలో తప్పుడు దరఖాస్తుచేసిన 51 మందిపై కేసు నమోదు చేసినట్టు ఈఆర్‌వో వెంకటనారాయణ తెలిపారు. అందులో బతికిఉన్న వ్యక్తులను చనిపోయినట్లు దరఖాస్తుచేసిన 18 మందిపై ఇప్పటికే కేసులు నమోదుచేసినట్టు చెప్పారు. తాజాగా మంగళవారం పర్చూరు, యద్దనపూడికి సంబంధించి మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దీంతోపాటు సైబర్ క్రైం ద్వారా తప్పుడు దరఖాస్తుచేసిన 28మందిపై పోలీసులు కేసునమోదు చేశారన్నారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వ వివక్ష

» కార్యకర్తల ధ్వజం
» 21వ రోజుకు చేరిన సమ్మె
» పలుచోట్ల వినూత్న నిరసనలు


పర్చూరు తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీల నిరసన

పర్చూరు, జనవరి 2: తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం కేంద్రాలు మూసివేసి సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలపై ప్రభుత్వం వివక్ష వైఖరిని ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పర్చూరులో అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తొలుత స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మానవహారం నిర్వహించి గౌవర వేతనం వద్దు , కనీస వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. చంటి బిడ్డలతో కార్యాలయం ముందు బైటాయించి గత ఇరవై రోజులకు పైగా సమ్మెబాట పడితే ప్రభుత్వం పట్టించుకోక పోవటం దారుణమన్నారు.

అద్దంకిటౌన్: అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్టు కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా శిబిరాన్ని జేడీ శీలం సందర్శించి సంఘీభావం తెలిపారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తలు కోలాట ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. బీఎస్పీ నాయకుడు మందా జోసఫ్, ఇతర నాయకులు ధర్నాలో కూర్చుని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నేతలు తంగిరాల వెంకటేశ్వర్లు, పి. తిరుపతిరెడ్డి, రమేష్, జి.శారద, మనోలత, అనిత, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: తమ న్యాయమైన కోర్కెలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పంగులూరులో అంగన్‌వాడీలు తమ నిరసన దీక్షను కొనసాగించారు. కనీస వేతనం, గ్రాట్యువిటీ అమలు విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

ఇంకొల్లు, జనవరి 2: మండలంలోని ఇడుపులపాడులో 22వ రోజు సమ్మెలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండు చేశారు. గేదెలకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నాగండ్ల వెంకట్రావు, ప్రాజెక్టు లీడర్లు బిక్కి సరళ, లక్ష్మీకుమారి, దేవమణి, సుజాత, లత, పద్మ, అనూరాధ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె 22వ రోజు కొనసాగింది. బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని 64 అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు, హెల్పర్లు మంగళవారం సమ్మెలో ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవటం లేదని నిరసనగా దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు.


అద్దంకిలో కోలాటం ఆడుతూ పాటలు నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఈప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పాట ల రూపేణా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సరస్వతి, శ్రీలలిత, సునంద, భారతి, సత్యవతి, జ్యోతి, శ్రీదేవి, శివపావని, అనురాధ, అనుపమ, వెంకటరత్నం, వెంకట రమణ, చిన్నమ్మాయి తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: రాష్ట్రంలో 21 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆ యాలు మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. కొరిశపాడు మండల కార్యాలయం వద్ద తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను దున్నపోతుకు ఇచ్చి నిరసన తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మాటతప్పి మడమ తిప్పారని ఎం జగన్‌పై ధ్వజమెత్తారు. తమ డిమాండ్లను పరిష్కరించేవరకు ఆందోళన ఆగదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.

మార్టూరు: మార్టూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బత్తుల హనుమంతరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు యూనియన్ నాయకులు రాణి, శ్యామల, సుహాసిని, విజయ తదితరులు పాల్గొన్నారు.


మార్టూరులో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రభుత్వం దిగొచ్చేవరకు పోరు

చీరాల, జనవరి 2: ప్రభుత్వ మెడలు వంచి అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు సాధించుకునే వరకు సమ్మె కొనసాగుతుందని, అప్పటివరకు తాము పూర్తిగా మద్దతుగా నిలుస్తామని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్.బాబూరావు అన్నారు. సమ్మె కొనసాగింపులో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలకు సీఐటీయూ, సీపీఐ, సీపీఎం బాధ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం బాధ్యులు బేడా వెంకట్రావు, ఎం.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువకు సాగు నీరందించాలి

» ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల, జనవరి 2: కొమ్మమూరు కాలువకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మంగళవారం ఇరిగేషన్ ఈఎన్‌సీ నారాయణరెడ్డిని కోరారు. ఆయకట్టులోని రైతులు ఎమ్మెల్యే బలరాంకు తమ సమస్య విన్నివించిన నేపథ్యంలో ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ ఏడాది సాగునీరు అందించలేమని ముందస్తుగా చెప్పినప్పటికి, అప్పటికే కొందరు మాగాణి సాగుచేసి ఉన్నారని చెప్పారు. ఈనేపథ్యంలో ఈఎన్‌సీ ఎస్ఈతో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దు!

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు పురోగతి తెలుపాలని, అలసత్వం వద్దని ఎమ్మెల్యే కరణం బలరాం సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా పనులను వేగవంతం చేయాలని చెప్పారు. తనను కలసిని పలువురితో మాట్లాడుతూ ఎన్నికల వేళ ఒకవిధంగా, మామూలు రోజుల్లో ఒకవిధంగా పనిచేయటం తనకు చేతకాదన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించటం ద్వారా మన్ననలు పొందటమే తన విధానమని చెప్పారు.

ఫిష్ డ్రైయర్ యూనిట్‌తో అధిక ప్రయోజనం

చీరాల, జనవరి 2: ఫిష్ డ్రైయర్ యూనిట్‌తో మత్స్యకారులకు ఎంతో ఉపయోగమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నా రు. మండలంలోని వాడరేవులో నూతనంగా ఏర్పాటుచేసిన ఫిష్ డ్రైయర్ యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వపరంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అక్కల శ్రీనివాసరెడ్డి, మచ్చ సువార్త, చావలి వాసు, నర్రా బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

305 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, జనవరి 2: మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎంపీడీవో కె.స్వరూపరాణి తెలిపారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కె.కీర్తిసరోజ్, బి.నాగేంద్ర, గైనకాలాజిస్ట్ డాక్టర్ షణ్ముఖశ్రీ, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ జి.పృథ్వీలు 305 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పలువురికి కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు, ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి, పి.రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెతో పేరుకుపోతున్న చెత్త

చీరాల, జనవరి 2: పారిశుధ్య కార్మికుల సమ్మెతో పట్టణ శివారు ప్రాంతాలలో చెత్త పేరుకుపోతుంది. దీంతో దోమకాటు పెరిగిందని ఆ ప్రాంతాల వారు ఆవేదన చెందుతున్నారు. వ్యాధుల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య చర్యలను మెరుగు పరచాలని కోరుతున్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆప్రాంతాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

ఇంకొల్లు, జనవరి 2: మండలంలోని నాగండ్ల గ్రామానికి చెందిన రోటరీక్లబ్ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు తన సతీమణి లక్ష్మీకాంతం జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం అభినందనీయమని రోటరీక్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు అన్నారు. పొలిమేర ఆంజనేయస్వామి గుడి ఆవరణలో శ్రీవీరప్రతాప ఆంజనేయస్వామి అన్నదాన సత్రం వద్ద సుమారు రూ.30వేల విలువ కలిగిన సీసీ కెమెరాలను సోమేపల్లి రామ్మోహనరావు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి చుండి సాంబశివరావు, సభ్యులు వత్సవాయి రాఘవరాజు, గోరంట్ల నాగేశ్వరరావు, అన్నదాన నిర్వాహకులు పులఖండం బద్రిరెడ్డి, సింహాద్రి వెంకటేశ్వరరెడ్డి, బాచిన నాగేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కళ్ళజోళ్ళ పంపిణీ

పంగులూరు, జనవరి 2: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. పంగులూరులో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించి శుక్లాల ఆపరేషన్ చేయించిన రోటరీక్లబ్ ప్రతినిధులు 40 మందికి కళ్ళజోళ్ళను అందచేశారు. స్థానిక రోటరీక్లబ్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి డాక్టర్ వై.ఎల్లారెడ్డి సంబంధిత వ్యక్తులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరణం హనుమంతరావు, షేక్ కాలేషావలి, సీపీఎం నేత నాగబోయిన రంగారావు, చిలుకూరి వీరరాఘవయ్య, గుర్రం ఆంజనేయులు, జాగర్లమూడి సుబ్బారావు, ఆర్వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత


ప్రత్యేక పూజల్లో కొండయ్య

చీరాల, జనవరి 2: భక్తి భావంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని బుర్లవారి పాలెంలో మంగళవారం భవానీ స్వాములు నిర్వహించిన ఇరుముడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది

అద్దంకిటౌన్, జనవరి 2: భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనిదని ఎంఈవో బుదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం అద్దంకి సత్రంబడి ఆవరణంలోని భవిత విద్యావనరుల కేంద్రంలోని విద్యార్థులకు ఉపాధ్యాయుడు జగన్నాధం బాబురావు వ్రాత అట్టలు, నోట్ పుస్తకాలు, పెన్నులు సమకూర్చగా, ఎంఈవో చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు పోలిరెడ్డి సహకారంతో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇట్టా రామారావు, ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాసరావు, పాలపర్తి యోనా, సాంబశివరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో పాఠశాలకు కుర్చీలు అందజేత

అద్దంకిటౌన్, జనవరి 2: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గాజులపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోటరీ మాజీ అధ్యక్షుడు కొల్లి సురేంద్ర సౌజన్యంతో రెండు జింక్ ర్యాక్‌లను అందజేశారు. గురకాయపాలెం జడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు రోటరీ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో పది కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి గొట్టిపాటి జయసింహ, హెచ్‌ఎం సుజాత, రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ యు.దేవపాలన, షేక్ మహ్మమద్ రఫీ, నర్రా శ్రీలక్ష్మి, ఆంజనేయులు, హరిప్రసాద్, గోపాలరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

బల్లికురవ, జనవరి 2: మండల పరిదిలోని అద్దంకి - నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడు రాయపూడి వెంకయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ముండ్లమూరు మండలం రమణారెడ్డిపాలెంకు చెందిన రాయపూడి వెంకయ్య బైకుపై బల్లికురవ మండలం సూరేపల్లి వస్తున్నాడు. ఈక్రమంలో కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న వెంకయ్య 15 అడుగుల మేర ఎగిరి రోడ్డు మార్జిన్‌లోకి పడిపోయాడు. బాటసారులు ప్రమాదాన్ని గమనించి వెంటనే నామ్ రోడ్డు అంబులెన్స్‌కు సమాచారం అందించటంతో క్షతగాత్రుడిని నర్సారావుపేట వైద్యశాలకు తరలించారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు


బల్లికురవ, జనవరి 2: మండలంలోని గుంటుపల్లి మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న గోళ్ల సుమలత తనను భర్త, అత్తమాలు, అడపడుచు వరకట్న వేధింపులకు గురిచేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.వేమన తెలిపారు. సుమలతకు కారంచేడుకు చెందిన గోళ్ల వెంకటేశ్వరరావుతో వివాహమైంది. భర్త మానసికంగా వేధింపుతలతో పాటు శారీరకంగా వేధిస్తున్నాడని పేర్కొంది. భర్తతో పాటు అత్తామామలు శ్రీనివాసరావు, విజయలక్ష్మి, అడపడుచు నాగమల్లేశ్వరి వరకట్నం కింద అధిక నగదు తీసుకు రావాలని తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని పేర్కొంది. ఈమేరకు మహిళా పోలీసు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు పలుగ్రామాల నాయకులతో గొట్టిపాటి సమీక్ష

అద్దంకిటౌన్, జనవరి 2: మండలంలోని పలు గ్రామాలలోని టీడీపీ నాయకులతో బుధవారం జొన్నతాళిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించన్నారు. మండలంలోని మణికేశ్వరం, శింగరకొండపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజెంట్‌లు, పేజి నేస్తం సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, జనవరి 2: ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తులసీరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం అద్దంకి వచ్చిన ఆయన డిపోలోని కార్మికులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై డిపో అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ ప్రతినెలా పదో తేదిలోపు కార్మికులకు జీతాలు చెల్లించాలని, ప్రతి ఆరు నెలలకు పెరిగే డీఏ బకాయిలను ఆరియర్స్ రూపంలో కార్మికులకు చెల్లించాలన్నారు. ఈఎస్ఐలో కార్మికుల కుటుంబ సభ్యులందరిని నమోదు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బాపట్ల జిల్లా గౌరవాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.



2 రోజులు.. రూ.10 కోట్ల మద్యం

- నూతన సంవత్సర వేడుకల్లో భారీగా పెరిగిన అమ్మకాలు



నెల్లూరు (క్రైం), జనవరి 2 : నూతన సంవత్సర వేడుకల్లో మందుబాబుల నుంచి రూ.కోట్ల మద్యం తాగించాలని ప్రభుత్వం ముందుగా వేసిన ప్లాన్ బాగా సక్సెస్ అయినట్లు కనిస్తోంది. డిసెంబరు 31, జనవరి 1వ తేదీలు అంటే రెండే రెండు రోజుల్లో రూ.10.71 కోట్ల మద్యాన్ని ఉఫ్ అనిపించారు. విక్రయాలు పెంపే లక్ష్యంగా ఆ రెండు రోజుల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం షాపులకు, 1 గంట వరకు బార్లకు సమయ వేళలు పెంచారు. సహజంగా జిల్లాలో ఒక్క రోజుకు రూ.3 కోట్ల మద్యం సేల్స్ ఉంటాయి. అయితే డిసెంబరు 31న రూ.6.34 కోట్లు, జనవరి 1వ తేదీన రూ.4.37 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. మద్యపాన నిషేధం చేసి ఎన్నికల్లో ఓట్లు అడుగుతామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మద్యం దుకాణాల వేళలు పెంచి మందు బాబులను తాగండి.. ఊగండి అంటూ దోచుకుంటున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.



పోలీసుల పరుగుల వేట!

- అట్టహాసంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి

నెల్లూరు (క్రైం), జనవరి 2 : లాఠీలు పట్టుకుని నేరస్థుల వెనుకబడే పోలీసులు బాల్ చేత పట్టుకొని వికెట్లు తీసేందుకు పరుగులు తీశారు. ఖాకీ డ్రస్ వేసుకొని పని ఒత్తిడిలో ఉండే పోలీసులు క్రీడా దుస్తులు ధరించి గెలుపు కోసం శ్రమించారు. నెల్లూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో నువ్వా.. నేనా!? అన్నట్టు ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. జిల్లా వార్షిక స్పోర్ట్స్ మీట్-2023 అట్టహాసంగా మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌ను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పావురాలను, బెలూన్‌లను గాలిలోకి వదిలి ప్రారంభించారు. ఐదు సబ్ డివిజన్లు, ఏఆర్, హోమ్‌గార్డ్స్ డీపీవో అధికారులు, సిబ్బంది ఈ క్రీడల్లో పాల్గొంటున్నారు.

- **ఎస్పీ ఆల్‌రౌండ్ షో**

స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఎస్పీ తోటి అధికారులు, సిబ్బందితో కలిసి క్రికెట్ ఆడారు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఎస్పీ ఆల్‌రౌండ్ షో ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తొలిరోజు అథ్లెటిక్స్, కబడ్డీ, బ్యాడ్మింటన్, పుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, క్యారమ్స్, క్రికెట్ తదితర పోటీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది హోరాహోరీగా తలబడ్డారు.



నెల్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

తగ్గని అంగన్‌వేడి!

- కొనసాగుతున్న ఆందోళనలు
- ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంపై ఆగ్రహం

నెల్లూరు (వైద్యం), జనవరి 2 : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. నెల్లూరు నగరంలోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీలు ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్యాట్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని వెల్లడించారు. ఈ నెల 5వ తేదీలోపు విధుల్లో చేరాలని అంగన్‌వాడీలకు నోటీసులు జారీ చేయడం ఏమిటంటూ దుయ్యబట్టారు. ఈ నిరసనలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు సునీత, రజనీ, రమ, సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉలవపాడులో అంగన్వాడీలకు కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు రూ.20 ఆర్థిక సాయం అందజేశారు. ఇక కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, వరికుంటపాడు, కోవూరు, ఉలవపాడు తదితర ప్రాంతాల్లోనూ అంగన్వాడీలు ఆందోళన కొనసాగించారు.

'పండగ' పేరుతో పింఛను ఆలస్యం

- అవ్వాతాతలు, ఒంటరి మహిళలకు అందని పెన్షన్
- సర్వేపల్లి, కందుకూరులో మాత్రమే పంపిణీ

ప్రతి నెలా ఒకటో తేదీన ఇచ్చే సామాజిక పింఛన్ల పంపిణీ ఈ నెల ఆలస్యమవుతోంది. రెండో తేదీ దాటినా రెండు నియోజకవర్గాల్లోనే వీటిని ప్రారంభించారు. దీంతో కొత్త ఏడాది ఒకటో తేదీన అవ్వాతాతలు పింఛను అందుకోలేక పోయారు.

నెల్లూరు(హరనాథపురం), జనవరి 2 : సాధారణంగా ప్రతినెలా ఒకటో తేదీన పింఛను పంపిణీ ప్రారంభించి ఐదో తేదీతో ముగిస్తారు. అయితే ఇప్పటి వరకు ఇస్తున్న పింఛను మొత్తాన్ని రూ.2750 నుంచి రూ.3వేలకు పెంచడంతో దానిని ప్రచారం చేస్తూ పండుగ వాతావరణంలో ఎమ్మెల్యేల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 8వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని అధికారికంగా ప్రకటించినా 10, 12 తేదీల వరకు సాగే పరిస్థితి కనిపిస్తోంది. అదీకాక, జిల్లావ్యాప్తంగా ఒకేసారి కాకుండా ఎమ్మెల్యేలు వారికి కేటాయించిన తేదీల్లో పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. మంగళవారం సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో మాత్రమే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ ప్రారంభించారు. కందుకూరు రూరల్‌లో ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి పింఛన్లు అందజేశారు. కాగా, కందుకూరు అర్బన్‌లో, నెల్లూరు నగర నియోజకవర్గంలో బుధవారం పెన్షన్ల పంపిణీ మొదలుకానుంది. ఆత్మకూరులో ఈ నెల 5న, కోవూరులో ఈనెల 6న, నెల్లూరు రూరల్‌లో 8వ తేదీన.. ఇలా ఒక్కో నియోజకవర్గంలో వేర్వేరు తేదీల్లో పింఛన్లు అందజేయనున్నారు. జిల్లాలో 3,21,325 మంది పెన్షన్‌దారులకు రూ.96.20కోట్లు వైఎస్ఆర్ పెన్షన్ కానుకగా పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వ నిర్ణయంతో ఈ నెల ఎప్పటికి పింఛను అందుతుందో అనే ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది.



- **సవాలక్ష నిబంధనలు**

సంగం : కొత్త పింఛన్ పొందేందుకు ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు విధించడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. గతంలో పింఛన్ కోసం ఆధార్, బియ్యం కార్డులతోపాటు ఆధార్, కుల ధ్రువీకరణ, ఆదాయ పత్రాలను అందించేవారు. అయితే, ఈసారి గతంలో చేసే నకళ్లతోపాటు విద్యుత్ మీటరు బిల్లు, ఓటరు కార్డులను జతపర్చాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు ప్రజలు దరఖాస్తులు చేశారు. అయితే, పింఛన్ల మంజూరుపై ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సచివాలయంలోని లాగిన్‌లో లబ్ధిదారుడి వివరాలు సేకరించిన తరువాత పింఛన్ మంజూరుకు ఎంపీడీవో లాగిన్‌కు సిఫారసు చేశారు. వాటిని ఎంపీడీవో పరిశీలించిన తరువాత ఆయా దరఖాస్తులను అమరావతిలో సెర్ప్ కార్యాలయానికి పంపించారు. పింఛన్ల మంజూరు అక్కడే జరగాల్సి ఉంది. అయితే జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో దీనికి సంబంధించి ఎటువంటి వివరాలు లేవు. ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుదారుల వివరాలు ప్రస్తుతం కంప్యూటర్‌లో కనిపించడం లేదు. దీంతో పింఛన్లు ఎవరికి మంజూరవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కాగా, కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఎరువుల కొరత తీరిందోచ్!

కోవూరు, జనవరి 2 : జిల్లా రైతాంగానికి శుభవార్త. ఎరువుల కొరత తీర్చేలా జిల్లాకు 49వేల మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువుల బస్తాలు రైల్వే వ్యాగిన్లలో కోవూరు మండలం పడుగుపాడు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాయి. స్టేషన్ యార్డు నుంచి లారీల్లో ఆర్బీకేలకు తరలిస్తున్న ఎరువుల బస్తాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలోగా మరో 10వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు రానున్నాయని చెప్పారు. ఆర్బీకేలలో స్టాకు రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి కూడా పరిశీలనలో ఉన్నారు.

కనెక్షన్ కోసం కలెక్షన్!

- ఏసీబీ వలలో ట్రాన్స్‌కో సిబ్బంది
- వ్యవసాయ కనెక్షన్ మంజూరుకు నగదు డిమాండ్
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన రైతు
- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇన్చార్జి ఏఈ, మరో ఇద్దరు ఉద్యోగులు



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో సిబ్బంది

జలదంకి, జనవరి 2 : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఓ రైతు వద్ద నగదు తీసుకుంటూ ట్రాన్స్‌కో ఏఈతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. కావలికి చెందిన రైతు దివి నరసింహారావుకు జలదంకి మండలం తిమ్మసముద్రంలో వ్యవసాయ భూమి ఉంది. తన వ్యవసాయ బోరుబావికి విద్యుత్ కనెక్షన్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, కనెక్షన్ ఇవ్వాలని మూడు నెలలుగా ట్రాన్స్‌కో సిబ్బంది చుట్టూ తిరుగుతున్నా వారు పట్టించుకోలేదు. దీంతో విసిగెత్తిన నరసింహారావు సదరు సిబ్బందిని నిలదీయడంతో నగదు డిమాండ్ చేశారు. చివరకు వారితో రూ.20వేలు లంచం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న రైతు నెల్లూరులోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు ఇచ్చిన నగదును మంగళవారం ఉదయం జలదంకి సబ్‌స్టేషన్‌లో ఉన్న ఇంచార్జి ఏఈ చంద్రశేఖర్, తిమ్మసముద్రం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ వాకా అశోక్‌కుమార్‌లకు నగదు ఇవ్వబోగా వారి సూచన మేరకు అక్కడే ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సానా ఏడుకొండల సాంబశివరావుకు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ తన సిబ్బందితో కలిసి ఏఈని ఇద్దరు ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి వివరాలను రాబట్టేందుకు సాయంత్రం వరకు సబ్‌స్టేషన్ వద్దే ఉండి విచారించారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు శ్రీనివాస్, విజయ్‌కుమార్ కిరణ్, అంజనేయరెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, ఎన్నడూలేని విధంగా ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో మండల కేంద్రమైన జలదంకిలో కలకలం రేగింది.



కొలువుదీరిన ముగ్గురమ్మలు

ముగ్గురమ్మల తిరునాళ్ల

- గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మలకు గ్రామోత్సవం
- అల్లూరుకు పోటెత్తిన భక్తజనం

గొడ్డందు.. బిడ్డందు.. పాడందు.. పంటందు.. అంతా సుఖంగా చూసుకునే గంగమ్మకు, కలుగోళమ్మకు, పోలేరమ్మకు తిరునాళ్లహో.. అంటూ రెండు చాటింపుల అనంతరం మూడో చాటింపుగా మంగళవారం అల్లూరులో గ్రామదేవతలకు తిరునాళ్లను నిర్వహించారు. అక్కాచెలెళ్లు అయిన శక్తి దేవతలకు అల్లూరు ప్రజలు మంగళవారం చల్ది నైవేద్యాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యం వహించగా కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కార్యక్రమాన్ని చేపట్టారు. చల్ది నైవేద్యాన్ని సమర్పించేందుకు ఇంటింటా శోభను నింపే పసుపు రంగు మట్టి కుండల్లో చల్ది నింపి 1001 మంది మహిళలు తలపై పెట్టుకుని ఊరేగింపుగా విష్ణువర్ధన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి విష్ణు సతీమణి శివప్రియతో బయలుదేరి పోతురాజుకు నైవేద్యం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవార్లకు అభిషేకం, కుమ్మరి వారి సంప్రదాయ అఖండ ప్రతిష్ఠ, సాయం త్రం రత్నాలంకారం, బంగారు చీరలో పోలేరమ్మ ప్రత్యేక దర్శనం, విశిష్ట పూజలు, రాత్రి అమ్మవార్లకు ప్రత్యేక పూలాలంకరణ జరిగింది. తప్పెట్లు, తీన్‌మార్, మంగళవాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవార్ల గ్రామోత్సవం సాగిం ది. ఆయా కార్యక్రమాల్లో ఆచారంగా వస్తు న్న వీరతాళ్లు, గంగపెట్టె తదితర సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తజనం పోటెత్తింది.

\- అల్లూరు



పసుపు కుండల్లో చల్ది నైవేద్యాన్ని తీసుకెళ్తున్న మహిళలు

ఉరితాడే శరణ్యం!

కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ సిబ్బంది సమ్మె



నెల్లూరు (విద్య) : తమకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, తమకు ఇక ఉరితాళ్లే శరణ్యమని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం ఉరితాళ్లు మెడకు వేసుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడంతోపాటు హెచ్ఆర్‌సీ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 5వ తేదీన విజయవాడలోని ఎస్పీడీ కార్యాలయాన్ని ముట్టడించి తామేంటో ప్రభుత్వానికి చూపుతామని హెచ్చరించారు. ఈ నిరసనలో జేఏసీ నాయకులు విష్ణువర్ధన్ రావు, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే!

మున్సిపాలిటీల్లో పేరుకు పోతున్న చెత్తాచెదారం

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి దిగడంతో మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. శాశ్వత, ప్రత్యామ్నాయ కార్మికులతో చెత్తను తొలగిస్తున్నా ప్రధాన కూడళ్లలో మాత్రం కుప్పలు పేరుకుపోయాయి. సమ్మెలోకి దిగి ఎనిమిది రోజులు గడుస్తున్నా ప్రభుత్వ పెద్దల్లో చలనం లేక పోవడంపై కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి.

నెల్లూరు (సిటీ), జనవరి 2 : పారిశుధ్య కార్మికుల సమ్మెతో నెల్లూరు కార్పొ రేషన్ పరిధిలో చెత్త పేరుకుపో తోంది. తాగునీటి విభాగం, వీధిలైట్ల కార్మికులు సుమారుగా 200 మంది మినహా మిగిలిన అన్ని విభాగాల్లోని 1,440 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. 270 మంది శాశ్వత కార్మికులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కింద చెత్తను సమీకరి స్తున్నారు. 54 డివిజన్ల నుంచి నిత్యం 300 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా కార్మికుల కొరతతో 70 టన్నుల వరకు డంపింగ్ యార్డులకు చేర్చుతున్నారు. నివాసాల మధ్య చెత్తను సేకరించడం ఆపేసిన అధికారులు, ప్రధాన రోడ్లు, కూడళ్ల వద్ద మాత్రమే చెత్తను తరలిస్తున్నారు.

- **కావలిలో అదనపు సిబ్బంది..**

● **కావలి** : పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం దర్శనమిస్తోంది. 34 మంది శాశ్వత, 241 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన కార్మికులు పని చేస్తున్నారు. వీరు సరిపడక అవసరం మేరకు దినసరి వేతనంపై కార్మికులను నియమిస్తుంటారు. పట్టణ పరిధిలో రోజుకు 60 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. కాగా, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులలో ఓ యూనియన్‌కు చెందిన సుమారు 100 మంది సమ్మెలోకి వెళ్లారు. మూడు రోజులుగా వీరు చేసే పనులు ఆగిపోవటంతో పట్టణంలో చెత్తాచెదారం పేరుకుపో యింది. చెత్త వాహనాలు నడిపేందుకు ప్రైవేటు వ్యక్తులను నియమించారు. అలాగే అదనంగా 20 మంది దినసరి వేతనం కింద నియ మించినట్లు కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

● **ఆత్మకూరు** : మున్సిపల్ పరిధిలో 74 మంది కార్మికులు విధులు నిర్వహిస్తుండగా 29 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగి లిన 45 మంది సమ్మెలో ఉండ టంతో పలు ప్రదేశాల్లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకు పోయింది. ప్రతి రోజూ 16 టన్నుల మేర చెత్త సేకరిం చాల్సి ఉంది. దీంతో అధి కారులు 20 మందిని ఒప్పంద పద్ధతిలో తీసుకుని చెత్తను తరలిస్తున్నారు. అయినా 7 టన్నుల మేర చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.



ఆత్మకూరు : టెలికం కార్యాలయ సమీపంలో...



నెల్లూరు : పాతమార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త



కావలి క్రిస్టియన్ పేటలో..



నెల్లూరులో రోడ్డుపైకి చేరిన చెత్తాచెదారం

పొగతోటలో ఉద్రిక్తత

- ప్రైవేట్ వారిని అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్

నెల్లూరు (సిటీ), జనవరి 2 : ఉద్యోగ భద్రత కల్పిస్తూ క్రమబద్ధీకరణ చేయాలన్న ఏకైక డిమాండ్‌తో సమ్మెలోకి దిగిన పారిశుధ్య కార్మికులకు పోటీగా కార్పొరేషన్ అధికారులు ప్రైవేట్ కార్మికులను రంగంలోకి దింపారు. మంగళవారం పొగతోటలోని మూడు హాళ్ల కూడలి వద్ద విధుల్లో ఉన్న ప్రైవేట్ కార్మికులను సమ్మెలోని పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. ఇరువురి మధ్య వాగ్వివాదం తలెత్తడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చెత్తను తరలించేందుకు వీల్లేదంటూ వాహనాలను ఆందోళనకారులు అడ్డుకోవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పలువురిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న కమిషనర్ వికాస్‌మర్మత్ ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్త తరలింపును అడ్డుకోవద్దని సూచించారు. కాగ పోలీసులు అదుపులోకి తీసుకున్న కార్మికులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మీరు మొండైతే.. మేము జగమొండి ! : రెహానాబేగం



మాట్లాడుతున్న రెహానాబేగం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 2: 'సీఎం జగన్‌మోహన్‌రెడ్డీ.. మీరు మొండైతే మేము జగమొండి. ఆడుదాం ఆంధ్రాకు, రిషికొండలో భవన నిర్మాణాలకు రూ.కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయ్. మీ సలహాదారులకు రూ.లక్షల్లో వేతనాలు ఇస్తున్నావ్.. మాకు ఇచ్చేందుకు డబ్బులేవా ?'... అంటూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, రెహనాబేగం పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన అంగన్‌వాడీల ధర్నాలో వారు మాట్లాడారు. వేతనాన్ని తెలంగాణ కంటే రూ.వెయ్యి పెంచమని అడుగుతున్నాం. చర్చల పేరుతో కాలయాపన చేయడం తగదు. అంగన్‌వాడీలకు తీపికబురు చెప్పు అని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుజ్జుల మల్లికార్జున, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం 22వ రోజు అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి రెహనాబేగం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : సమ్మెలో భాగంగా బుధవారం చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం అన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, మండల నాయకులు మట్టి హరినారాయణ, షేక్ రజియా పాల్గొన్నారు.

ఆత్మకూరు : తమ డిమాండ్లు నెరవేర్చే వరకు పోరు ఆగదంటూ అంగన్‌వాడీలు మంగళవారం సమ్మె కొనసాగించారు. ప్రజా సంఘాలు, రాజకీయ పక్షపార్టీలు వారికి మద్దతును ప్రకటించాయి. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు జి శివప్రసాద్, ఏ నాగయ్య, కే హజరత్తయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు పి రాధ, కె రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మి, రూతమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఎమ్మార్వో ఆఫీసు ప్రాంగణంలో మంగళవారం జరిగిన అంగన్‌వాడీల ధర్నాలో యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనా బేగం, జిల్లా అధ్యక్షురాలు వై.సుజాతమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, ఆదిలక్ష్మి,కుమారి, చంద్రమ్మ పాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది గేయాలు ఆలపిస్తూ నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న మొండి వైఖరిపై అగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, గద్దర్‌బాబు, వేము పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 10లోపు రేషన్ సరుకుల పంపిణీ : జేసీ



సంగం : కార్డుదారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

సంగం, జనవరి 2: ప్రతి నెలా 10వతేదీలోపు ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీని పూర్తి చేయాలని జేసీ ఆర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సంగం తిరుమన తిప్ప ఎస్టీ కాలనీలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీని పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 438 ఎండీయూ వాహనాలు ఉంటే 412 వాహనాల ద్వారా బియ్యం, కందిపప్పు, చక్కెర, గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామన్నారు. కొందరు కార్డుదారులు వారికి ఉన్న సమస్య వల్ల కందిపప్పు తీసుకోవడం లేదని తెలిసిందన్నారు. ఆయన వెంట తహసీల్దారు నాగరాజు ఉన్నారు.

● రీసర్వేను త్వరగా పూర్తి చేయండి

ఏఎస్‌పేట : భూముల రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని జేసీ ఆర్ కూర్మనాథ్ తెలిపారు.మంగళవారం ఆయన మండలంలోని పెదబ్బీపురం సచివాలయన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లడుతూ అవసరం అయితే అదనపు సిబ్బందిని నియమించుకుని, రీసర్వే వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం జగనన్న సురక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత,తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల అందజేత

ఆత్మకూరు : అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను ప్రతి ఇంటికి చేర్చే క్రమంలో మంగళవారం ఆత్మకూరులోని పంటవీధిలో ప్రతి ఇంటికి వెళ్లి అందజేశారు. ముందుగా బీజేపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు పంటవీధిలోని కోదండ రామాలయం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పుచ్చలపల్లి రాధిక, కొప్పోలు రమాదేవి, తోకల తిరుపతమ్మ, ఆలయ పూజారి నాగరాజుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం : మండలంలోని సోమశిలలో మంగళవారం అయోధ్య రామమందిరం నుంచి పంపించిన పూజా అక్షితలను భక్తులు ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఆలయం ఫొటో పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కోదండ రామాలయ అర్చకులు శశిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

అనంతసాగరం: మండలంలోని లింగంగుంటలో మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జీవన ఎరువుల వినియోగం, వాటి ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ పీడీ దొరసానమ్మ మాట్లాడుతూ ఎరువుల వాడకంపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నత్రజని, భాస్వరం, పోటాషియం వాడకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీ దేవసేనమ్మ, మండల ఏవో శ్రీధర్ రెడ్డి, వీఏఏ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : మండలంలోని నర్రవాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వెంగళరావు మెమోరియల్ ట్రస్టు తరపున విద్యా సామగ్రిని అందచేశారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, మిగిలిన విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో దాత పచ్చవ రాకేష్, విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి రూరల్: పట్టణంలోని 1225 సర్వేనెంబరులో తమకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను ఆక్రమించారని మంగళవారం పలువురు లబ్ధిదారులు తహసీల్దారు శ్రీనివాసులరెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం ఎం.వహీదా, ఎం.సిరీని, ఎంఏ ఎగ్బాలున్నీబేగం, షేక్ జబీనా, ఎండీ అక్మల్, సింగనబోయిన రాజమ్మ తదితరులకు మూడుసెంట్ల స్థలం మంజూరు చేసిందన్నారు. ఇటీవల తాము ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు హద్దులు చూపించగా ఆక్రమణకు గురైందని గుర్తించామన్నారు. అందులో ఓ వ్యక్తి జామాయిల్ సాగు చేస్తున్నారన్నారు. పరిశీలించి ఆక్రమణను తొలగించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ఉదయగిరి రూరల్ : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఈవోపీఆర్డీ, సెక్టార్ అధికారి మల్లికార్జున తనిఖీ చేశారు. తొలుత ఆయన దుర్గంపల్లిలోని 53వ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి మౌలిక వసతులను పరిశీలించారు.కార్యక్రమంలో బీఎల్‌వో వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉదయగిరి నియోజకవర్గ ఈఆర్‌వో ప్రేమ్‌కుమార్ మంగళవారం మండలంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండలంలోని సీతారామపురం, సంగసానిపల్లి,సింగారెడ్డిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో కే సుధాకర్ రావు, హౌసింగ్ ఏఈ రామకృష్ణరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు, ఆర్‌ఐ శ్రీనివాసులు,వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

జడదేవిలో వైద్య శిబిరం

వరికుంటపాడు : మండలంలోని జడదేవి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఏనుగంటి చిన్నకొండయ్య, మక్కిన వెంకటరత్నం, గుర్రం గోపి, గుర్రం పుల్లయ్య, గుమళ్ల చిన్నచంచయ్య, కర్నాటి నాగయ్య కామేపల్లి శ్రీనివాసులు, కే చిన్న వెంకయ్య పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

చేజర్ల : మండలంలోని చిత్తలూరు చెన్నకేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయాల భూములకు గురువారం ఉదయం 10గంటలకు పంచాయితీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఈవో కే పెంచల వరప్రసాద్ తెలిపారు. మూడేళ్లపాటు కౌలుకు ఇచ్చేందుకు వేలం జరుగుతుందన్నారు.

5 నుంచి ఆరోగ్య సురక్ష

వరికుంటపాడు : మండలంలో ఈనెల 5 నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరాలను విజయవంతం చేయాలన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

ఉదయగిరి రూరల్, జనవరి 2: తాగునీటి కోసం పట్టణంలోని దేవలాలగడ్డ ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ తమ ప్రాంతానికి 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. షబ్బీర్ కాలనీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా చేసే పైపులైన్ దెబ్బతినడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా మన్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించాలని కోరారు.

ఆశీర్వదిస్తే అందుబాటులో ఉంటా... !

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 2: వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దుత్తలూరులోని బీసీకాలనీ, యాదవ వీధుల్లో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఏ.వెంకటేశ్వరరెడ్డి, గంగాధర్, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలోనే మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జనవరి 2: మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరింది. ఈ క్రమంలో వారు తమ విధులను బహిష్కరించి, మున్సిపల్ కార్యాలయం వద్ద ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా సీఐటీయు, సీపీఎం నాయకులు జీ శివప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, కే డేవిడ్‌రాజు పాల్గొని సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జీ నాగేంద్ర, షేక్ రిజ్వాన్, గురునాథం, జీ రమణయ్య పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు విద్యార్థుల ఎంపిక

వింజమూరు : రాష్ట్రస్థాయి కౌశల్ ప్రతిభా పరీక్షకు మండలంలోని గుండెమడకల ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.శ్రీసాయి తన్మయి, ఏ.సాయితేజ, షణ్ముఖప్రియ, సీహెచ్. లాస్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గోపిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆ యన ఆ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కె.రాము, శివ, కోటారెడ్డి, ఎం.మల్యాద్రి, ఎం.కోటేశ్వరరావు, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవమానాలకు గురి చేస్తున్నారు !

వింజమూరు : కొంతమంది తనను అవమానాలకు గురి చేస్తున్నారని ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ కే మాశిలామణి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండల పరిషత్ నిధులతో హిందూనగర్‌కు సిమెంట్ రోడ్డు వేశారని తెలిపారు. ఆ సమయంలో తన ఇంటి వరకు రోడ్డు వేయకుండా వది లేశారన్నారు. తన పట్ల వివక్ష చూపుతున్నారని జిల్లా కలెక్టర్, ఎస్పీకి తెలిపామన్నారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

'సురక్ష'కు స్పందన అరకొరే !

ఉదయగిరి రూరల్, జనవరి 2: ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఉదయగిరి మండలం వెంగళరావునగర్, దుత్తలూరు మండలం భైరవరం సచివాలయాల పరిధిలో నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి రోగులు నామమాత్రంగానే హాజరయ్యారు. రోగుల రిజిస్ట్రేషన్ కోసం సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొన్ని పంచాయతీల్లో సర్పంచులు తమవల్ల కాదని చేతులేత్తేయడంతో పంచాయతీ కార్యదర్శులు తమ జేబుల్లో నుంచి నగదును ఖర్చు చేస్తున్నారు. భైరవరం శిబిరాన్ని డ్వామా పీడీ వెంకట్రావు తనిఖీ చేసి ఓపీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఆయా కార్యక్రమంలో ఎంపీడీవోలు ఈశ్వరమ్మ, సాయిప్రసాద్, వైద్యులు వినీత, అయూబ్, వనజ, సర్పంచులు తిరుపతి, కల్పన పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

సీతారామపురం : ఎస్‌ఐ అనూషను మంగళవారం ఆమె నివాసంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైసీపీ నాయకులు సుబ్బారెడ్డి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచి దుగ్గయ్య మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు.

ప్రజలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

ఆత్మకూరు : మండలంలోని చెర్లోయడవల్లిలో మంగళవారం ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాన్ని, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం వైద్యులు ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందుల కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, సర్పంచులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

సీతారామపురం: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు రోగుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తగిన శ్రద్ధతో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, వైసీపీ నేతలు సుబ్బారెడ్డి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచి దుగ్గయ్య, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలపై అవగాహన

చేజర్ల : సోమశిల నీటి విడుదలపై మంగళవారం మండలంలోని నాగులవెల్లటూరులో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని, కొత్తగా వరినార్లు పోసుకోవద్దన్నారు. ఈనెల 15లోపు వరి నాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వీ శశిధర్, ఇరిగేషన్ ఏఈ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మర్రిపాడు : స్థానిక హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆర్థికంగా సహకరించిన ప్రభుత్వ వైద్యురాలు శాంతిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ధనలక్ష్మి, హెడ్మాస్టర్ పద్మ, యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నాయబ్, మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనం పెంచాలి

ఆత్మకూరు : ఉపాధి కూలీలకు తప్పనిసరిగా రోజుకు వేతనం రూ. 272 వచ్చేలా పని చేయించాల్సి ఉందని ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మేట్‌లకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వ నిర్దేశించిన 100 రోజులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శిరీషా తదితరులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వీఐపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఈసీగా జంషీర్

అల్లూరు: వీఐపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా అల్లూరుకు చెందిన షేక్ జంషీర్ ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు మంగళవారం తెలిపారు. జంషీర్ మాట్లాడుతూ తనకు ఈ పదవిని అందజేసిన జాతీయ డైరెక్టర్ కట్టడి ప్యారిస్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్‌ను ఇంటికి సాగనంపుదాం

● రామకృష్ణాపురంలో 'బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారెంటీ'



బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో ఇంటూరి, నూకసాని

లింగసముద్రం, జనవరి 2: రాష్ట్రాన్ని దోచుకుతింటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని ప్రకాశం జిల్లా పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ, కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి లింగసముద్రం పంచాయతీ రామకృష్ణాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీ పీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, నాయకులు గాలంకి ప్రసాద్, మద్దెల రామారావు, కండే మాలకొండయ్య, అడపా నర్సయ్య, బోడి సురేష్, ఎం మల్లికార్జున, ప్రభాకర్, వెంగళరావు, బచ్చు మాల్యాద్రి, చెంబేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఆదుకున్నది చంద్రబాబే..

ఉలవపాడు : రాష్ట్రం విడిపోయి కష్టకాలంలో ఉన్నప్పటికీ అంగన్వాడీలకు రెండు పర్యాయాలు రూ.6000 జీతాలు పెంచి ఆదుకున్న ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉలవపాడులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 22వ రోజు సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీల శిబిరాన్ని ఇంటూరి సందర్శించి సంఘీబావం తెలిపారు. ధర్నాలో పాల్గొంటున్న అంగన్‌వాడీల సాధారణ ఖర్చుల కోసం రూ.20,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

● న్యాయవాదుల రాస్తారోకో, మానవహారం



రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

కందుకూరు, జనవరి 2: భూ మాఫియాను పెంచి పోషించేలా సామాన్యుల ఆస్తులకు రక్షణ లేకుండా చేసేలా ఉన్న ఏపీ భూ హక్కుల చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో న్యాయవాదులు మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే అధికారం ఉ న్నవాళ్లది, దౌర్జన్యం చేయగలిగిన వారికి మాత్రమే ఆస్తులు మిగులుతాయని, సామాన్యు లంతా తమ ఆస్తులను వారికి అప్పజెప్పాల్సిన దయనీయ పరిస్థితులు వస్తాయని న్యాయ వాదులు ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టుల ప్రాంగణం వద్ద నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించిన న్యాయవాదులు అనంతరం పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిళ్లపల్లి మల్లికార్జున, సీనియర్ న్యాయవాది బెజవాడ కృష్ణయ్య చౌదరి, పెట్లూరి మురళి, న్యాయవాదులు సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు, వలేటి శ్రీధర్ నాయుడు, చిడిపోతు హరికృష్ణ, తిరుమలరావు, సాయిశంకర్, మహేష్ పాల్గొన్నారు.

కావలి అభివృద్ధే లక్ష్యం : పసుపులేటి



పసుపులేటికి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు

కావలి టౌన్, జనవరి 2 : కావలి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని పీఎస్‌ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని పీఎస్‌ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో అభిమానులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. తనపట్ల ఇంతటి అభిమానాన్ని చూపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో కావలి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. తాను పుట్టిన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తాను రాజకీయాల్లోకి రావలసి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన కోటపాటి జనార్దన్



చంద్రబాబుతో కోటపాటి

కందుకూరు, జనవరి 2: టీడీపీ అధినేత చంద్రబాబును మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కందుకూరు టికెట్ ఆశిస్తున్న కోటపాటి జనార్దన్ కలిశారు. కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గానికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. పలు విషయాలను ఆయన చంద్రబాబుకు వివరించే ప్రయత్నం చేయగా మీ గురించి నాకు అంతా తెలుసు, ఇద్దరు ముగ్గురు ముఖ్యులు మీ గురించి చెప్పి ఉన్నారని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కొంత కాలం తరువాత నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలిసింది. కాగా గత కొంతకాలంగా కందుకూరు నియోజకవర్గంపై దృష్టిపెట్టిన కోటపాటి జనార్దన్ ఇక్కడ సొంత కార్యాలయం కూడా నిర్మిస్తున్నారు.

22వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



మాట్లాడుతున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

కావలిటౌన్, జనవరి 2: అంగన్వాడీల సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. ఐఎంఎ, జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, జేవీవీ జిల్లా బాధ్యులు జానకిరామ్, హరనారపరెడ్డి, నాయీ బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాలగురుస్వామి, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కాకి ప్రసాద్‌లు వేర్వేరుగా శిబిరం వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెనుబాపల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు మాధవరావు, కార్యదర్శి మాల్యాద్రి, చెన్నకేశవులు, బాలకృష్ణ, సీఐటీయూ నేతలు పెంచలయ్య, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఆకులు తింటూ పారిశుధ్య కార్మికుల నిరసన



ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

కావలిటౌన్, జనవరి 2: నడుముకు ఆకులు కట్టుకుని, ఆకులు తింటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరింది. తినేందుకు తిండి లేదు కట్టుకునేందుకు బట్టలు లేవనే సందేశంతో కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, ఓ రమేష్, చిన్నమ్మ, రాజ్యలక్ష్మి, అనిత, రాజేశ్వరి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కందుకూరులో మున్సిపల్ కార్మికుల సమ్మె

కందుకూరు : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా ఈనెల 3 నుంచి కందుకూరులో ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనంద్‌మోహన్ తెలిపారు. పారిశుధ్య కార్మికుల మస్టర్ ప్రదేశంలో మంగళవారం కార్మికసంఘం నాయకులు, ఏఐటీయూసీ నాయకులు సమావేశం నిర్వహించి బుధవారం నుంచి సమ్మెలో పాల్గొనాలని తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, జంగాల మహేష్ పాల్గొన్నారు.

7 నుంచి పోలేరమ్మ జాతర

కావలిటౌన్, జనవరి 2: పట్టణంలోని పాతూరులో వెలసివున్న నడివీధి పోలేరమ్మ జాతర ఈనెల 7వ తేదీ నుంచి ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఆచారపు కర్తలు చాటింపు వేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం తొలి మంగళవారం ఆనవాయితీగా తాళ్లపాలెం సత్యం బృందంచే స్వచ్ఛందంగా మంగళవాయిద్యాల కచేరి నిర్వహించారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

కందుకూరు, జనవరి 2: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పెంచిన రూ.3 వేల పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టరు జీ.విద్యాధరి, ఎంపీడీఓ విజయశేఖర్, ఎంపీపీ సుశీల, జడ్పీటీసీ తొట్టెంపూడి అనసూయ, ఏడీఏ అనసూయ, ఏఓ వి.రాము పాల్గొన్నారు.

నార్తుమోపూరులో పోలేరమ్మకు పొంగళ్లు



అశ్వ వాహనంపై పోలేరమ్మ

అల్లూరు, జనవరి 2 : మండలంలోని నార్తుమోపూరులో వెలసి ఉన్న పోలేరమ్మ ఆలయంలో మంగళవారం పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ప్రతి ఏటా జనవరి మొదటి మంగళవారం నిర్వహించే తిరునాళ్లను పురస్కరించుకొని పోలేరమ్మ ఆయలంలో విశేష పూజలు నిర్వహించారు. పోతురాజుకు చల్డి నైవేద్యాన్ని సమర్పించిన అనంతరం అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి అమ్మవారిని అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కావలి రూరల్, జనవరి 2: కావలి మండలం ఆముదాలదిన్నె నుంచి కోళ్లదిన్నె వరకు రూ.3.25 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఏఎంసీకి చెందిన రూ23 కోట్లతో నియోజకవర్గంలోని కావలి, అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాల్లో రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థా నిక సర్పంచ్ ఊడా బ్రహ్మానందం, జడ్పీటీసీ జంపాని రామ వులు, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల నెంబర్లు పంపిణీ

అల్లూరు : మండలంలోని తూర్పు గోగులపల్లిలో మంగళవారం లబ్దిదారులకు జగనన్న ఇంటి పట్టాలకు సంబంధించిన నెంబర్లను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ వేణమ్మ, నాయకులు నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, కోమట్ల పవన్‌కుమార్, గుమ్మడి సురేంద్ర పాల్గొన్నారు.

వీఎస్‌యూ క్రికెట్ జోన్ విన్నర్, రన్నర్‌గా జేబీ, పీజీ కళాశాల జట్లు

కావలిటౌన్, జనవరి 2: విక్రమ సింహపురి యూనివర్శిటీ జోన్ క్రికెట్ విన్నర్‌గా జేబీ జట్టు, రన్నర్‌గా వీఎస్‌యూ పీజీ కళాశాల జట్టు నిలిచాయి. మంగళవారం పీజీ కళాశాలలో జరిగిన ఫైనల్స్‌లో జేబీ జట్టు కావలి పీజీ కళాశాల జట్టుపై 20 పరుగుల తేడాతో విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జేబీ వైఎస్ ప్రిన్సిపాల్ ఆర్ మాల్యాద్రి పాల్గొని విజేతలకు కప్పులు అందించి అభినందించారు. పీడీలు మణికంఠ, భాస్కర్‌రావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ

కొండాపురం, జనవరి 2: ఏపీటీఎఫ్-1938 సంఘం క్యాలెండర్, డైరీని మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు ఆనందరావు, రవికుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశాఖ రాష్ట్ర కౌన్సిలర్ జీ.చినబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.నాగేశ్వరరావు, ఎం.పుల్లయ్య, కార్యదర్శులు జి.మాల్యాద్రి, సుదీర్, వెంకటేశ్వర్లు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దు

కలిగిరి : ఎన్నికల్లో గ్రామాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలో తెల్లపాడులో మంగళవారం గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు, బెల్టు షాపులు వంటి అసాంఘిక చర్యలపై తమకు సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతల దృష్ట్యా నేర చరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేస్తామని తెలిపారు.